DHARANI NEWS DAILY

ధరణి న్యూస్

తెలుగు దినపత్రిక

www.dharaninews.com

సంపుటి : 01 సంచిక : 19, సోమవారం 21-09-2026 పేజీలు : 08 వెల : 3/-

విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా "ధరణి న్యూస్ " తెలుగు దినపత్రికలో బ్యూరో మండలాల రిపోర్టర్గా పనిచేయుటకు జిల్లాల నియోజకవర్గ స్థాయిలో ఉత్సవంతులు అయిన యువతి యువకులు కావలెను కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును. రిపోర్టర్లుగా అపాయింట్మెంట్ అయిన తర్వాత వారికి లైన్ అకౌంట్ కూడా ఇవ్వబడును. సంప్రదించవలసిన

ఫోన్ నెంబర్ : 9700719535.

నాలుగు వారాలు దాటినా దొరకని 6వేల మంది ఆచూకీ

- శిథిలాల తొలగింపునకు 4 నెలల సమయం
- అప్పర్ త్రిశూలి-1 ప్రాజెక్టు సొరంగం నుంచి 17 మృతదేహాల వెలికితీత
- శిథిలాల తొలగింపునకు మూడు, నాలుగు నెలలు పట్టొచ్చన్న నేపాల్ ఆర్మీ
- 12 వంతెనల మరమ్మతులు- మరో 33 వంతెనల పునర్నిర్మాణానికి టెండర్లు

2లో





2లో

ఎల్ నినో ప్రభావాన్ని ముందే అంచనా వేసుకున్నాం..

ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలి

- ఎల్ నినో ప్రభావం, ప్రభుత్వ కార్యాచరణపై సీఎం చంద్రబాబు సమీక్ష
- రైతులను ఆదుకోవడం, నిత్యావసరాల ధరల నియంత్రణే ప్రధాన లక్ష్యం
- బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు ధరలు అదుపులో ఉంచాలని ఆదేశం
- డిమాండ్‌కు తగిన పంటల సాగు, వర్షాధార వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచన
- విపత్తును ఎదుర్కొనేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం



రష్యా చమురు Vs అమెరికా మార్కెట్..

భారత్ ముందున్న ఎనర్జీ లెక్క ఇదే!

100 శాతం సుంకం భారత్‌పై ఇప్పటికే పడిపోయిందని కాదు. ట్రంప్‌కు అలాంటి సుంకం విధించే అధికారం వచ్చింది. ఎవరిపై ఎంత సుంకం వేయాలి, ఏ వస్తువులపై వేయాలి అన్నది తర్వాతి నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది. ఇక్కడే అసలు కథ మొదలవుతుంది. ఒక వైపు భారత్‌కు రష్యా చమురు చౌకగా దొరుకుతోంది. మరో వైపు అమెరికా మనకు పెద్ద ఎగుమతి మార్కెట్.

ఈ రెండింటి మధ్య సమతుల్యం కాపాడుకోవడం ఇప్పుడు భారత్‌కు పెద్ద పరీక్షగా మారింది.

100 శాతం సుంకం...

చాలామందికి ఇక్కడే ఒక అనుమానం వస్తోంది. అమెరికా 100 శాతం సుంకం వేస్తే భారత ప్రభుత్వం అమెరికాకు 100 శాతం డబ్బు కట్టాలా అంటే అలా కాదు. అమెరికాలోకి భారత వస్తువులు వెళ్లినప్పుడు అక్కడి దిగుమతిదారు ఆ సుంకాన్ని చెల్లిస్తాడు. ఆ తర్వాత ఆ భారం ఎవరి మీద పడుతుందనేది పరిస్థితిని బట్టి ఉంటుంది. అమెరికా కంపెనీ భరించవచ్చు. భారత ఎగుమతిదారుతో ధర తగ్గించమని అడగవచ్చు. చివరికి అమెరికా వినియోగదారుడి మీద ధర పెరగవచ్చు. 2025లో అమెరికా భారత్ నుంచి దాదాపు 103.8 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులు కొనుగోలు చేసింది. ఊహకు 100 శాతం సుంకం మొత్తం ఈ వస్తువులపై పడితే, సుంకం విలువ కూడా దాదాపు 103.8 బిలియన్ డాలర్ల వరకు ఉండొచ్చు. కానీ ఇది కేవలం

మిగతా 2లో

రష్యా నుంచి భారీగా చమురు దిగుమతి చేసుకుంటున్న భారత్‌కు అమెరికా కొత్త చట్టం కీలక సవాల్‌గా మారింది. ట్రంప్‌కు రష్యా చమురు కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారం వచ్చింది. అయితే భారత్‌పై 100 శాతం సుంకం ఇప్పటికే అమల్లోకి వచ్చినట్లు కాదు. రష్యా చమురు ధర, దిగుమతులు, అమెరికా మార్కెట్, రూపాయి, దేశీయ ఇంధన ధరలపై దీని ప్రభావం ఎలా ఉండొచ్చో తెలుసుకుందాం. రష్యా నుంచి చమురు కొంటున్న దేశాలపై అమెరికా కొత్త కొరడా ఝుళిపించే పరిస్థితి వచ్చింది. రష్యా చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కల్పించే చట్టం అమల్లోకి వచ్చింది. భారత్, చైనా లాంటి పెద్ద దేశాలపై కూడా ఈ నిబంధన ప్రభావం చూపే అవకాశం ఉండటం ప్రస్తుత చర్చనీయాంశంగా మారింది. అయితే ఒక విషయం స్పష్టంగా గుర్తుపెట్టుకోవాలి.



2లో

యెమెన్‌లో భీకర పోరు.. 24 గంటల్లో 44 మంది మృతి

- యెమెన్‌లో ప్రభుత్వ దళాలు, హౌతీల మధ్య భీకర పోరు
- తాయిజ్, లహజ్ ప్రావిన్సుల్లో కొనసాగుతున్న ఘర్షణలు
- వ్యూహాత్మక ప్రాంతాలకు బలగాలను తరలిస్తున్న ఇరు పక్షాలు



2లో

సౌదీకి సాయం చేస్తే ఉక్కు పిడికిలితో బదులిస్తాం: పాక్, టర్కీకి హౌతీల హెచ్చరిక

- సౌదీ అరేబియాకు సైనిక మద్దతివ్వొద్దని పాకిస్థాన్, టర్కీకి హౌతీల హెచ్చరిక
- జోక్యం చేసుకుంటే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయన్న హౌతీ నేత మహ్మద్ అల్-బుఖైతీ
- సౌదీ, పాక్, టర్కీ మధ్య కుదిరిన 'మక్కా రక్షణ ఒప్పందం'తో పెరిగిన ఉద్రిక్తతలు
- తమది ఆత్మరక్షణ పోరాటమేనని, తటస్థంగా ఉండాలని ఇరు దేశాలకు హౌతీల సూచన

అమెరికాతో చర్చలకు ఇరాన్ 7 షరతులు

- ఒప్పుకోకపోతే యుద్ధం తప్పదని టెహ్రాన్ హెచ్చరిక
- అమెరికాతో ఉద్రిక్తతల వేళ ఇరాన్ కీలక నిర్ణయం

2లో

- ఒప్పందం కోసం అమెరికా ముందు 7 షరతులను ఉంచిన టెహ్రాన్
- ఖతార్ సందేశం పంపిన ఇరాన్





2లో

వీధిలో నడిచే ఆడపిల్లను వేధించే సాహసం

ఎవరైనా చేస్తారా?

అలా చేస్తే మరణ శాసనం రాసుకున్నట్లే

- యూపీలో మహిళల భద్రతపై ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కీలక వ్యాఖ్యలు
- తన హయాంలో మతపరమైన అశాంతి పూర్తిగా తొలగిపోయిందని వ్యాఖ్య

మనవాళ్లి చైనాకు పట్టుబడ్డప్పుడు

నా పనైపోయిందనుకున్నా

- యువ ఐపీఎస్ అధికారిగా ఉన్నప్పటి ఘటనను గుర్తుచేసుకున్న డోభాల్
- ఆయన పంపిన నిఘా బృందాన్ని చైనా సైన్యం అదుపులోకి తీసుకుంది
- ఈ ఘటనతో తన కెరీర్ ముగిసిపోయిందని భావించినట్లు వెల్లడి
- హెడ్ క్వార్టర్స్ ఇచ్చిన తప్పుడు మ్యాపుల వల్లే సమస్య తలెత్తిందని విచారణలో తేలింది
- ఐఐటీ రూర్కీ స్నాతకోత్సవంలో పాత జ్ఞాపకాలను పంచుకున్న డోభాల్



2లో

DHARANI NEWS DAILY
ధరణి న్యూస్
www.dharaninews.com
తెలుగు దినపత్రిక
సోమవారం21 సెప్టెంబర్ 2026

రష్యా చమురు Vs అమెరికా మార్కెట్..

లెక్క కోసం వేసిన ఉదాహరణ. భారత్ నుంచి వచ్చే ప్రతి వస్తువుపై అంత సుంకం ఇప్పటికే పడిందని దీని అర్థం కాదు.

రష్యా చమురు ఎందుకు అంత ముఖ్యం.. భారత్‌కు కావాల్సిన ముడి చమురులో పెద్ద భాగం విదేశాల నుంచే వస్తుంది. అందులో రష్యా ముఖ్యమైన సరఫరాదారుగా మారింది. ఆగస్టులో భారత్ రోజుకు సుమారు 16 లక్షల బ్యారెళ్ల రష్యా ముడి చమురు కొనుగోలు చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. రోజుకు 16 లక్షల బ్యారెళ్లు అంటే ఏడాదికి దాదాపు 58.4 కోట్ల బ్యారెళ్లు. ఒక్క బ్యారెల్ ధరను ఉదాహరణకు 70 డాలర్లు అనుకుంటే, ఏడాది చమురు విలువ దాదాపు 40.9 బిలియన్ డాలర్లు అవుతుంది. ఇది ఎందుకు ముఖ్యమంటే చమురు ధరలో చిన్న మార్పు వచ్చినా దేశం ఖర్చు చేసే డబ్బులో భారీ మార్పు వస్తుంది. ఉదాహరణకు బ్యారెల్‌కు 10 డాలర్లు అదనంగా చెల్లించాల్సి వస్తే, 58.4 కోట్ల బ్యారెళ్లకు ఏడాదికి సుమారు 5.84 బిలియన్ డాలర్లు అదనపు భారం పడుతుంది. అంటే చమురు ధరలో చిన్న మంట కూడా దేశ ఖజానాపై పెద్ద వేడిని పెడుతుంది.

రష్యా చమురు తగ్గిస్తే ఏమవుతోంది.. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు తగ్గిస్తే ఆ లోటును ఇంకెక్కడి నుంచో భర్తీ చేయాలి. మధ్యప్రాచ్యం, అమెరికా, ఇతర దేశాల నుంచి చమురు కొనాల్సి రావచ్చు. అక్కడ ధర ఎక్కువగా ఉంటే మన దిగుమతి బిల్లు పెరుగుతుంది. చమురు ఖరీదు పెరిగితే కథ అక్కడితో ఆగదు. పెట్రోల్, డీజిల్ ధరలపై ఒత్తిడి రావచ్చు. లారీలు, బస్సులు, ట్రాక్టర్లు, పరిశ్రమల ఖర్చులు పెరగొచ్చు. రవాణా ఖర్చు పెరిగితే సరుకుల ధరలపై కూడా ప్రభావం పడొచ్చు. అయితే చమురు ధర పెరిగిన ప్రతిసారీ పెట్రోల్, డీజిల్ ధరలు అదే స్థాయిలో పెరుగుతాయని చెప్పలేం. అంతర్జాతీయ ధరలు, రూపాయి విలువ, దేశీయ ధరల విధానం, చమురు కంపెనీల నిర్ణయాలు కూడా ఇందులో కీలకమే.

అమెరికా మార్కెట్ కూడా మనకు పెద్దదే.. రష్యా చమురు ఒక వైపు ఉంటే అమెరికా మార్కెట్ మరో వైపు ఉంది. 2025లో అమెరికా భారత్ నుంచి సుమారు 103.8 బిలియన్ డాలర్ల వస్తువులు కొనుగోలు చేసింది. అదే సమయంలో భారత్ అమెరికా నుంచి సుమారు 45.4 బిలియన్ డాలర్ల వస్తువులు కొనుగోలు చేసింది. అంటే వస్తువుల వాణిజ్యంలో అమెరికా నుంచి భారత్‌కు వచ్చే దానికంటే అమెరికాకు మనం అమ్మేది ఎక్కువ. ఇప్పుడు అమెరికా భారత వస్తువులపై భారీ సుంకం పెడితే మన ఎగుమతిదారులకు ఇబ్బంది రావచ్చు. అమెరికాలో మన వస్తువుల ధర పెరుగుతుంది. ధర పెరిగితే అక్కడి కొనుగోలుదారులు ఇతర దేశాల వస్తువుల వైపు చూడొచ్చు. అప్పుడు మన ఎగుమతులు తగ్గే అవకాశం ఉంటుంది.

మన ఎగుమతులు తగ్గితే.. అమెరికాకు సరుకులు అమ్మి భారత్ డాలర్లు సంపాదిస్తుంది. ఆ ఎగుమతులు తగ్గితే విదేశీ మారకద్రవ్య ఆదాయం మీద ఒత్తిడి రావచ్చు. అదే సమయంలో చమురు కోసం మనం ఎక్కువ డాలర్లు ఖర్చు చేయాల్సి వస్తే మరో వైపు డాలర్ల అవసరం పెరుగుతుంది. ఇది రెండు వైపులా ఒత్తిడి లాంటిది. ఒక వైపు ఎగుమతుల నుంచి వచ్చే డాలర్లు తగ్గొచ్చు. మరో వైపు చమురు దిగుమతులకు వెళ్లే డాలర్లు పెరగొచ్చు. దీంతో రూపాయి మీద కూడా ఒత్తిడి రావచ్చు.

భారత్ ఏం చేయాలి.. ఇప్పుడు వెంటనే రష్యా చమురు మొత్తం ఆపేయడం కూడా సరైన పరిష్కారం కాదు. అలాగే ఒక్క రష్యాపైనే ఆధారపడటం కూడా మంచిది కాదు. ఒక్క చెట్టుపై ఆధారపడితే నీడ పోయిన రోజు కష్టం. అందుకే చమురు కొనుగోళ్లలో దేశాల సంఖ్య పెంచుకోవాలి. రష్యా నుంచి కొనుగోలు చేస్తూనే మధ్యప్రాచ్యం, అమెరికా, ఇతర దేశాలతో కూడా సరఫరా మార్గాలు బలంగా ఉంచుకోవాలి. చౌకగా దొరికే చోట కొనాలి. కానీ ఒక్క దేశం మీద పూర్తిగా ఆధారపడకుండా జాగ్రత్త పడాలి. దేశంలో వ్యూహాత్మక చమురు నిల్వలను కూడా పెంచాలి. ప్రపంచంలో ఎక్కడైనా యుద్ధం వచ్చినా, సరఫరా ఆగినా కొన్ని రోజులు మన అవసరాలు నడిచేలా నిల్వలు ఉండాలి.

అమెరికాతో చర్చలు.. భారత్ అమెరికాతో గొడవ పెట్టుకోవాల్సిన అవసరం లేదు. అలాగే ఒత్తిడికి వెంటనే లొంగాల్సిన అవసరం కూడా లేదు. చర్చల ద్వారా రెండు దేశాలకు ఉపయోగపడే మార్గం చూడాలి. భారత్ అమెరికా నుంచి మరిన్ని వస్తువులు, ఇంధనం, ఇతర ఉత్పత్తులు కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలించవచ్చు. అదే సమయంలో భారత వస్తువులకు అమెరికా మార్కెట్ తెరిచి ఉండేలా చర్చలు జరపాలి. అంటే లెక్క సూటిగా ఉంది. మనం వాళ్ల దగ్గర కొంటే, వాళ్లు మన దగ్గర కొనడానికి కూడా మార్గం ఉండాలి. ఎగుమతులకు కొత్త దారులు కావాలి. అమెరికా మార్కెట్ చాలా పెద్దది. కానీ మన ఎగుమతులు ఒక్క అమెరికాపైనే ఆధారపడకూడదు. యూరప్, మధ్యప్రాచ్యం, ఆఫ్రికా, ఆసియా దేశాల్లో భారత వస్తువులకు మరిన్ని మార్కెట్లు వెతకాలి. ఒక మార్కెట్‌లో సమస్య వస్తే మరో మార్కెట్ ఆదుకునేలా వ్యవస్థ ఉండాలి. మన ఊళ్లలో రైతు ఒక్క పంటనే నమ్ముకోడు. ఒక పంట దెబ్బతింటే మరో పంట ఉండేలా చూసుకుంటాడు. దేశ ఆర్థిక వ్యవస్థ కూడా అలాగే ఉండాలి.

సామాన్యుడికి భారం ఎక్కడ.. చమురు ఖరీదైతే మొదట రవాణా ఖర్చుపై ప్రభావం పడొచ్చు. రవాణా ఖర్చు పెరిగితే సరుకుల ధరలపై ఒత్తిడి రావచ్చు. అమెరికా సుంకాలు పెరిగితే మరో సమస్య. అక్కడ భారత వస్తువులు ఖరీదవుతాయి. అమ్మకాలు తగ్గితే ఎగుమతి సంస్థల ఆదాయం, ఉత్పత్తి, ఉపాధిపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. కానీ ఇవన్నీ ఎంత మేర జరుగుతాయో ఇప్పుడే ఖచ్చితంగా చెప్పలేం. ఎందుకంటే 100 శాతం సుంకం మొత్తం భారత వస్తువులపై అమలవుతుందా, ఏ వస్తువులపై పడుతుంది, భారత్ రష్యా నుంచి ఎంత చమురు కొనుగోలు చేస్తుంది, అంతర్జాతీయ చమురు ధర ఎలా ఉంటుంది అన్నది ముందున్న పరిణామాలపై ఆధారపడి ఉంటుంది.

భారత్ ముందున్న సవాల్.. ఇది రష్యా లేదా అమెరికా అనే రెండు దేశాల్లో ఒకదాన్ని ఎంచుకునే విషయం కాదు.భారత్‌కు చౌకైన చమురు కావాలి. ఇంధన సరఫరా కూడా ఆగకూడదు. అమెరికా లాంటి పెద్ద మార్కెట్లలో మన ఎగుమతులు కూడా కొనసాగాలి. రూపాయి మీద ఒత్తిడి రాకూడదు.

దేశంలో ధరలు అదుపులో ఉండాలి. ఈ అన్ని లెక్కలను ఒకేసారి చూసుకోవాలి. రెండు పడవల మీద కాలు పెడితే నది దాటలేమనే సామెత ఉంది. కానీ ఇక్కడ భారత్ చేయాల్సింది రెండు పడవల్లో ఒకదానిపైకి దూకడం కాదు. అవసరమైతే ఉపయోగించుకునేలా మరిన్ని పడవలను సిద్ధంగా ఉంచుకోవాలి.

చివరిగా.. అందుకే రష్యా నుంచి చమురు కొనుగోళ్లను అవసరానికి తగ్గట్టు కొనసాగిస్తూనే, ఇతర దేశాల నుంచి కూడా సరఫరా మార్గాలు తెరిచి ఉంచుకోవాలి. అమెరికాతో చర్చలు కొనసాగించాలి. ఎగుమతులకు కొత్త మార్కెట్లు వెతకాలి. దేశీయ ఇంధన వనరులు, పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ వాహనాలు, ప్రజా రవాణాపై పెట్టుబడులు పెంచాలి. చివరికి భారత్‌కు కావాల్సింది ఒక్క దేశం మీద ఆధారపడే విధానం కాదు. చమురు ఎక్కడి నుంచైనా తెచ్చుకునే శక్తి, వస్తువులు ఎక్కడికైనా అమ్ముకునే మార్కెట్లు, సంక్షోభం వచ్చినా తట్టుకునే ఆర్థిక బలం. రష్యా చమురు ఒక వైపు. అమెరికా మార్కెట్ మరో వైపు.. మధ్యలో భారత ప్రయోజనం. ఇదే ఇప్పుడు భారత్ ముందున్న అసలు ఎనర్జీ పరీక్ష. ప్రస్తుత చట్టం ట్రంప్‌కు 100% వరకు సుంకాలు విధించే అధికారాన్ని ఇస్తోంది.. అయితే.. భారత్‌పై ఎంత సుంకం, ఎప్పుడు విధిస్తారనేది తదుపరి నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది.

ఎల్ నినో ప్రభావాన్ని ముందే అంచనా వేసుకున్నాం..

రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం, తీసుకోవాల్సిన చర్యలు, కార్యాచరణ ప్రణాళిక అమలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు, ఆర్ఎస్కే సిబ్బందితో ఆయన టెలీకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎల్ నినో వంటి విపత్తుల పరిస్థితుల్లో రైతులను ఆదుకోవడం, మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు పెరగకుండా నియంత్రించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని ఆయన స్పష్టం చేశారు.

ఈ విపత్తును ఒక సవాలుగా స్వీకరించి, ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, “ఎల్ నినో పరిస్థితులను మనం ముందుగానే అంచనా వేశాం. దీనికోసం సిద్ధం చేసుకున్న యాక్షన్ ప్లాన్ ప్రకారం ప్రతి ఒక్కరూ పనిచేయాలి. ఎల్ నినో ప్రభావం కేవలం రైతులపైనే కాదు, అన్ని వ్యవస్థలపైనా పడుతుంది. కాబట్టి రైతులను కాపాడుకుంటూనే, వినియోగదారుల పై ధరల భారం పడకుండా చూడటం మన బాధ్యత” అని అన్నారు.

బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు వంటి నిత్యావసరాల ధరలను కచ్చితంగా అదుపులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. గోదాముల్లోని బియ్యం నిల్వలను మార్కెట్‌లోకి విడుదల చేసి, ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉల్లి కొరతను అధిగమించేందుకు ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేయడంతో పాటు, భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా ఉల్లి సాగును ప్రోత్సహించాలని తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను వివరిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా 50.7 శాతం లోటు వర్షపాతం నమోదైందని, ముఖ్యంగా ప్రకాశం, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో 30.84 లక్షల హెక్టార్లకు గాను, ఇప్పటివరకు 79 శాతం భూముల్లోనే సాగు పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు.

ఈ నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు పంటల బీమా మొత్తాలు వారికి అందేలా చూడాలని, డిమాండ్ ఆధారిత పంటల సాగుపై దృష్టి సారించాలని చెప్పారు. వర్షాధార పంటలు, ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ, హైరిస్క్ జోన్‌లోని ఉద్యాన పంటలను కాపాడేందుకు రూ.190 కోట్లు కేటాయించామని, ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఖరీఫ్ కంటింజెన్సీ ప్రణాళిక కోసం రూ.60 కోట్లు సిద్ధం చేశామని, 1.31 లక్షల క్వింటాళ్ల విత్తనాలను 80 శాతం సబ్సిడీతో రైతులకు సరఫరా చేశామని తెలిపారు. స్వయం సహాయక బృందాల ద్వారా కిచెన్ గార్డెన్‌లను ప్రోత్సహించి కూరగాయల ధరలను అదుపులో ఉంచవచ్చని అభిప్రాయపడ్డారు. పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత లేకుండా చూడాలని ఆదేశించారు.

గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రస్తావిస్తూ, “2014-19 మధ్య మేము ఇరిగేషన్‌పై రూ.65 వేల కోట్లు ఖర్చు చేస్తే, 2019-24 మధ్య నాటి ప్రభుత్వం కేవలం రూ.22 వేల కోట్లే ఖర్చు చేసింది. ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఎల్ నినో వంటి విపత్తు వచ్చినా ఇబ్బందులు ఉండేవి కావు. మేము అధికారంలోకి వచ్చాక రూ.3,500 కోట్లతో 100 రోజుల్లో హంద్రీ-నీవా కాలువలకు నీరందించగలిగాం” అని చంద్రబాబు గుర్తుచేశారు.

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, స్థానిక ఎన్నికలున్నా ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పర్యటించి రైతులకు ధైర్యం చెప్పాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం, రైతు, సాగునీటి సంఘాలు కలిసికట్టుగా పనిచేసి ఎల్ నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోవాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

నాలుగు వారాలు దాటినా దొరకని 6వేల మంది ఆచూకీ

ఆకస్మిక వరదలతో అతలాకుతలమైన నేపాల్‌లో పరిస్థితులు ఇంకా పూర్తిగా చక్కబడలేదు. వరదలు సంభవించి నాలుగు వారాలు దాటినా సుమారు 6 వేల మంది ఆచూకీ ఇంకా తెలియలేదు. దీంతో గల్లంతైన వారి కోసం నేపాల్‌లో ఆదివారం కూడా గాలింపు చర్యలు కొనసాగాయి. నదీ తీర ప్రాంతాలు, శిథిలాల క్షేత్రాలు, దెబ్బతిన్న జలవిద్యుత్ ప్రాజెక్టుల వద్ద సహాయక బృందాలు గాలిస్తున్నాయి. ఆగస్టు 26న నేపాల్-టిబెట్ సరిహద్దు సమీపంలో ప్రారంభమైన ఆకస్మిక వరదలు ఉత్తర, మధ్య నేపాల్‌లోని పట్టణాలు, గ్రామాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. హిమాలయ ప్రాంతం నుంచి దక్షిణంగా ప్రవహించే భోటేకోశి నది వరద నీటితో ఉప్పొంగడంతో ఇళ్లు, వాహనాలు, రోడ్లు, వంతెనలు కొట్టుకుపోయాయి. పలు జలవిద్యుత్ ప్రాజెక్టులు కూడా దెబ్బతిన్నాయి.

సొరంగం నుంచి 17 మృతదేహాలు.. వరదలతో దెబ్బతిన్న జలవిద్యుత్ ప్రాజెక్టుల వద్ద నేపాల్ ఆర్మీ సహాయక చర్యలను కొనసాగిస్తోంది. రసువాలోని అప్పర్ త్రిశూలి-1 జలవిద్యుత్ ప్రాజెక్టు వద్ద ఓ సొరంగంలో సహాయక సిబ్బంది 17 మృతదేహాలను వెలికితీశారు. రీన్‌ఫోర్స్‌మెంట్ మెష్‌లో చిక్కుకుని, బురదలో కూరుకుపోయిన మృతదేహాలను గుర్తించారు. మృతదేహాలను బయటకు తీసేందుకు సహాయక సిబ్బంది గ్రైండర్లు, గ్యాస్ కట్టర్లు, రోటరీ పరికరాలను ఉపయోగించినట్లు నేపాల్ సైన్యం తెలిపింది. సొరంగాల్లో భారీగా పేరుకుపోయిన శిథిలాలు సహాయక చర్యలకు అడ్డంకిగా మారాయి. ప్రభావితమైన కొన్ని సొరంగాల నుంచి శిథిలాలను పూర్తిగా తొలగించడానికి మూడు నుంచి నాలుగు నెలల సమయం పట్టవచ్చని ఈ నెల ప్రారంభంలో నేపాల్ ఆర్మీకి చెందిన ఓ ఫీల్డ్ కమాండర్ తెలిపారు.

రోడ్లు, వంతెనలు ధ్వంసం.. వరదల ప్రభావంతో పలు ప్రాంతాల్లో రోడ్లు, వంతెనలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా నువాకోట్, ధాడింగ్ జిల్లాల్లోని కమ్యూనిటీలను కలిపే వంతెనలు ధ్వంసమయ్యాయి. దీంతో స్థానికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నేపాల్ ప్రభుత్వం త్రిశూలి కారిడార్ వెంబడి ఉన్న సస్పెన్షన్ వంతెనల మరమ్మతులను ప్రారంభించింది. మొత్తం 12 సస్పెన్షన్ వంతెనలపై ప్రస్తుతం మరమ్మతు పనులు జరుగుతున్నాయి. వీటిని అక్టోబర్ 6 నాటికి తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మరో 33 వంతెనలు మరమ్మతు చేయలేనంతగా దెబ్బతిన్నాయి. వాటిని పూర్తిగా పునర్నిర్మించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ వంతెనల పునర్ని ర్మాణం కోసం ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. వంతెనలు దెబ్బతినడంతో మార్కెట్లు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, ఇతర నిత్యావసర సేవలకు రాకపోకలు కష్టంగా మారాయి. కొన్ని ప్రాం తాల ప్రజలు నదిని దాటేందుకు సుదీర్ఘ మార్గాలను ఎంచుకోవాల్సి వస్తోంది. మరికొందరు తాత్కాలిక ఏర్పాట్లపై ఆధారపడుతున్నారు.

మృతదేహాల గుర్తింపు సవాల్.. ఈ విపత్తులో మృతిచెందిన వారిని గుర్తించడం అధికారులకు మరో పెద్ద సవాల్‌గా మారింది. మెరుపు వరదల్లో 1,450 మందికిపైగా మృతిచెందినట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు కేవలం 110 మృతదేహాలను మాత్రమే గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగిం చినట్లు అధికారులు తెలిపారు. వరద ప్రవాహంలో కొట్టుకుపోయిన మృతదేహాలు తీవ్రంగా దెబ్బతినడం, ఎక్కువ కాలం నీటిలో ఉండటంతో కుళ్లిపోవడం, కొన్ని సందర్భాల్లో శరీర భాగాలు మాత్ర మే లభించడం వంటి కారణాలతో గుర్తింపు ప్రక్రియ క్లిష్టంగా మారిం ది. ముఖం, దుస్తులు లేదా వ్యక్తిగత వస్తువుల ఆధారంగా మృతులను గుర్తించడం అనేక సందర్భాల్లో సాధ్యం కావడం లేదు. చాలాసేపు నీటిలో మునిగి ఉండటం, బురద, శిథిలాలకు గురికావడం వల్ల గుర్తించే శారీరక లక్షణాలు నశించిపోతున్నాయి. కొన్ని అవశేషాలు ముక్కలైపోవడం లేదా ఇతర అవశేషాలతో కలిసిపోవడం కూడా గుర్తింపు ప్రక్రియను మరింత కష్టతరం చేస్తోంది.

డీఎన్ఏ పరీక్షలపై ఆధారం.. ఈ పరిస్థితుల్లో మృతులను గుర్తించేందుకు డీఎన్ఏ పరీక్షలు కీలకంగా మారాయి. అయితే ఇది సమయం తీసుకునే ప్రక్రియ. మృతదేహాల అవశేషాలతో పాటు, వాటిని సరిపోల్చేందుకు జీవించి ఉన్న కుటుంబ సభ్యుల నుంచి కూడా నమూనాలు అవసరమవుతాయి. ఇప్పటివరకు దాదాపు 1,300 మృతదేహాల డీఎన్ఏ నమూనాలను సేకరించినట్లు అధికారులు తెలిపారు. నమూనాలు సేకరించిన అనంతరం మృతదేహాలను తాత్కాలికంగా ఖననం చేశారు. డీఎన్ఏ పరీక్షల ద్వారా మృతులను గుర్తించి వారి కుటుంబాలకు సమాచారం అందించే ప్రక్రియ కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, నేపాల్‌తో పాటు చైనా వైపున కూడా ఈ ఆకస్మిక వరదల ప్రభావం కనిపించింది. చైనా మీడియా ప్రకారం, అక్కడ 43 మంది మృతిచెందగా, 500 మందికిపైగా ఆచూకీ తెలియకుండా పోయింది. నేపాల్‌లో మాత్రం రసువా, పొరుగు జిల్లాల్లోని నదీ తీర ప్రాంతాలు, శిథిలాల క్షేత్రాలు, దెబ్బతిన్న జలవిద్యుత్ ప్రాజెక్టుల వద్ద గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి.

అమెరికాతో చర్చలకు ఇరాన్ 7 షరతులు

అమెరికాతో నెలకొన్న ఉద్రిక్తతలకు ముగింపు పలికేందుకు ఇరాన్ 7 డిమాండ్లను అమెరికా ముందుంచింది. ఇరు దేశాల మధ్య చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తున్న ఖతార్ ద్వారా షరతులను అమెరికాకు పంపినట్లు ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మొహ్సెన్ రెజాయి అధికారికంగా ప్రకటించారు. ఒకవేళ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ డిమాండ్లను తిరస్కరిస్తే, తాము ఏ క్షణంలోనైనా ఒక ‘నిర్ణాత్మక యుద్ధానికి’ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఓ అంతర్జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రెజాయి ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. అమెరికాతో దౌత్యపరమైన చర్చలను పునరుద్ధరించేందుకు ఖతార్, పాకిస్థాన్ దేశాలు కొంతకాలంగా తీవ్రంగా కృషి చేస్తున్నాయి. ఫిబ్రవరి చివరిలో అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై ప్రారంభించిన దాడుల తర్వాత పశ్చిమాసియాలో పరిస్థితులు దారుణంగా తయారయ్యాయి. ఈ నేపథ్యంలో ఖతార్ మధ్యవర్తిగా ఇరాన్ షరతులను వాషింగ్టన్‌కు చేరవేసిందని, ప్రస్తుతం తాము డొనాల్డ్ ట్రంప్ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నామని రెజాయి పేర్కొన్నారు.

షరతుల్లో కీలకమైనవి ఇవే..

ఈ సందర్భంగా ఏడు షరతులను అమెరికా నెరవేర్చాలని రేజాయి డిమాండ్ చేశారు. ఈ విషయంలో టెహ్రాన్ వైఖరి స్పష్టంగా ఉందని తెలిపారు. అమెరికా తనంతట తానుగా సృష్టించుకున్న ఈ చిక్కుముడి నుంచి బయటపడాలంటే ఇరాన్ హక్కులను గౌరవించాల్సిందేనని స్పష్టం చేశారు. ఇరాన్ సమీపంలో మోహరింపులు, యుద్ధాన్ని పూర్తిగా నిలిపివేయాలని రెజాయ్ డిమాండ్ చేశారు. విదేశీ బ్యాంకుల్లో స్తంభింపజేసిన ఇరాన్ నిధులను తక్షణమే విడుదల చేయాలన్నారు. ఇరాన్ సముద్ర తీరాలపై కొనసాగుతున్న నౌకాదళ దిగ్బంధాన్ని ఎత్తివేయయాలని షరతు విధించారు. ఇలాంటి ఏడు డిమాండ్లను అమెరికా ముందు ఉంచినట్లు చెప్పారు. ట్రంప్ బెదిరింపులు తమపై ఎటువంటి ప్రభావం చూపవని, తాము హక్కుల సాధన కోసం ఎంతటి పోరాటానికైనా వెనుకాడబోమని తేల్చిచెప్పారు.

‘వారి కదలికలపై ఫోకస్ పెట్టాం’..

అమెరికా వైపు నుంచి మరో విడత దాడులు జరిగే అవకాశం ఉందని ఇరాన్ అంచనా వేస్తోంది. గత అనుభవాల నేపథ్యంలో ఇరాన్ తన సైనిక వ్యూహాలను పూర్తిగా మార్చుకున్నట్లు రెజాయి తెలిపారు. ముఖ్యంగా పర్షియన్ గల్ఫ్ నుంచి గల్ఫ్ ఆఫ్ ఓమన్ మీదుగా అరేబియా సముద్రం వరకు మోహరించిన అమెరికా నౌకాదళ స్థావరాలు, విమాన వాహక నౌకల కదలికలపైనే తాము ఫోకస్ పెట్టామన్నారు. ఇటీవల అమెరికా నౌక సమీపంలోనే ఒక బహుళ-వార్‌హెడ్ యాంటీ షిప్ క్షిపణిని పరీక్షించినట్లు రెజాయ్ చెప్పుకొచ్చారు. ఒకవేళ మళ్లీ దాడులు పునరావృతమైతే, ప్రాంతీయంగా ఉన్న అమెరికా సైనిక స్థావరాలతో పాటు స్థానికంగా వ్యాపారాలు సాగిస్తున్న అమెరికన్ కంపెనీలు, వాణిజ్య ప్రయోజనాలే లక్ష్యంగా భారీ ప్రతిదాడులు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

అణు కార్యక్రమంపై కీలక వ్యాఖ్యలు..

ఇరాన్ అణు కార్యక్రమంపై వస్తున్న ఊహాగానాలపై కూడా రెజాయి మాట్లాడారు. తాము ఇప్పటివరకు అణు నిరాయుధీకరణ ఒప్పందం నుంచి తప్పుకునే నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. అయితే, అమెరికా దూకుడు విధానాలు తమను కఠిన నిర్ణయాలు తీసుకునేలా ప్రేరేపించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అణ్వాయుధాల తయారీని నిషేధిస్తూ ఇరాన్ మత పెద్దలు జారీ చేసిన ఫత్వాకు తాము కట్టుబడి ఉన్నామని, ప్రస్తుతానికి తమ అణు సిద్ధాంతంలో ఎలాంటి మార్పు లేదని ఆయన పునరుద్ఘాటించారు.

తుది దశకు ఒమన్‌తో ఒప్పందం..

బాబ్ అల్-మందబ్ జలసంధి మూసివేత అనేది పూర్తిగా హూతీ ఉద్యమానికి సంబంధించిన యెమెన్ అంతర్గత విషయమని రెజాయి స్పష్టం చేశారు. అలాగే హర్మూజ్ జలసంధికి సంబంధించి ఒమన్‌తో కుదిరే ఒప్పందం తుది దశకు వచ్చిందని, త్వరలోనే దీనిపై ప్రాంతీయ దేశాల ఆమోదంతో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

మరోవైపు, సెప్టెంబర్ 18 నుంచి 28 వరకు న్యూయార్క్‌లో జరుగనున్న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ అత్యున్నత స్థాయి సమావేశాలకు హాజరయ్యే ఇరాన్ ప్రతినిధి బృందానికి అమెరికా విదేశాంగ శాఖ వీసాలు మంజూరు చేసింది.

సౌదీకి సాయం చేస్తే ఉక్కు పిడికిలితో బదులిస్తాం: పాక్, టర్కీకి హౌతీల హెచ్చరిక

యెమెన్‌కు చెందిన హౌతీ రెబల్స్.. పాకిస్థాన్, టర్కీ దేశాలకు తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. సౌదీ అరేబియాకు మద్దతుగా సైనిక బలగాలను పంపినా లేదా ప్రత్యక్షంగా జోక్యం చేసుకున్నా ‘ఉక్కు పిడికిలి’తో బదులిస్తామని స్పష్టం చేశారు. సౌదీ అరేబియా, పాకిస్థాన్, టర్కీ మధ్య ఇటీవల కుదిరిన త్రైపాక్షిక రక్షణ ఒప్పందం నేపథ్యంలో ఈ హెచ్చరికలు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను మరింత పెంచాయి. హౌతీ అన్సార్ అల్లా పొలిటికల్ బ్యూరో సభ్యుడు మహ్మద్ అల్-బుఖైతీ ఇటీవలి ఇంటర్వ్యూలలో ఈ హెచ్చరికలు చేశారు. “దేవుడి సాక్షిగా చెబుతున్నా.. ఒకవేళ పాకిస్థాన్, టర్కీ ఈ యుద్ధంలో జోక్యం చేసుకుంటే, మేము వారిపై ఉక్కు పిడికిలితో విరుచుకుపడతాం. సౌదీ అరేబియాకు బుద్ధి చెబుతున్నట్లే, ఆ రెండు దేశాలకు కూడా క్రమశిక్షణ నేర్పుతాం” అని వ్యాఖ్యానించారు. తాము సౌదీ నేతృత్వంలోని సైనిక చర్యలు, ఆర్థిక దిగ్బంధనానికి వ్యతిరేకంగా ఆత్మరక్షణ పోరాటమే చేస్తున్నామని బుఖైతీ పునరుద్ఘాటించారు. పాకిస్థాన్, టర్కీ ప్రభుత్వాలు ఈ వివాదంలో తటస్థంగా ఉండాలని, తమ సరిహద్దులకు సంబంధం లేని యుద్ధంలో తలదూర్చవద్దని ఆయన సూచించారు. ఆగస్టు 7న సౌదీ అరేబియా, పాకిస్థాన్, టర్కీలు “మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్”పై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం, మూడు దేశాల్లో ఏ ఒక్కరిపైన దాడి జరిగినా దానిని ముగ్గురిపై జరిగిన దాడిగా పరిగణిస్తారు.

ఈ ఒప్పందం కింద సౌదీ భూభాగాన్ని రక్షించడానికి సిద్ధంగా ఉన్నామని పాకిస్థాన్ అధికారులు ఇప్పటికే ప్రకటించారు. టర్కీ కూడా సౌదీకి అవసరమైన సైనిక, సాంకేతిక సాయం అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలిచ్చింది. సౌదీలోని ఇంధన వనరులు, ప్రధాన నగరాల సమీప ప్రాంతాలపై హౌతీలు డ్రోన్లు, క్షిపణులతో దాడులు తీవ్రతరం చేసిన తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అయితే, ఈ కొత్త రక్షణ ఒప్పందం కింద విదేశీ బలగాలను యెమెన్‌లో మోహరించినట్లు ఇంకా అధికారికంగా ధ్రువీకరణ కాలేదు.

యెమెన్‌లో భీకర పోరు..

24 గంటల్లో 44 మంది మృతి

యెమెన్‌లో ప్రభుత్వ దళాలు, హౌతీ తిరుగుబాటుదారుల మధ్య ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. గత 24 గంటల్లో జరిగిన భీకర పోరులో కనీసం 44 మంది మరణించినట్లు సైనిక వర్గాలు వెల్లడించాయి. దేశ నైరుతి ప్రాంతంలోని తాయిజ్, లహిజ్ ప్రావిన్సుల్లో ఈ ఘర్షణలు చోటు చేసుకున్నాయి. తాయిజ్ ప్రావిన్సులోని అల్-కదా, అల్-వాజియా ప్రాంతాల్లో హౌతీలు జరిపిన దాడులను ప్రభుత్వ బలగాలు తిప్పికొట్టాయి. ఈ ఘర్షణల్లో ఆరుగురు ప్రభుత్వ సైనికులు, 11 మంది హౌతీ సాయుధులు మరణించారు. మ

గోపనపల్లి తండాలో వైభవంగా గణేష్ నిమజ్జన శోభాయాత్ర:

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రవికుమార్ యాదవ్, గంగాధర్ రెడ్డి

గచ్చిబౌలి, ధరణి న్యూస్, సెప్టెంబర్ 20 : గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపనపల్లి తండాలో తుల్జా భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జన శోభాయాత్ర అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ మహోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినాయకుని దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ నగరంలో యువత అంతా ఐక్యంగా జరుపుకునే విశిష్ట పండుగ గణేష్ నవరాత్రి వేడుకలని గణపయ్య నిమజ్జనం అనేది ముగింపు కాదని ఒక కొత్త శుభ ఆరంభానికి సంకేతమని పేర్కొన్నారు. నిమజ్జన కార్యక్రమాల కోసం అన్ని చెరువుల వద్ద పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశారని భక్తులందరూ శాంతియుత వాతావరణంలో ఈ వేడుకలను జరుపుకోవాలని కోరారు.



విప్రో జంక్షన్‌లో మహేశ్వరం పోలీసుల వాహన తనిఖీలు:

: అవగాహనతో పాటు పలువురికి చలాన్లు

మహేశ్వరం,(ఫ్యూచర్ సిటీ), ధరణి న్యూస్, సెప్టెంబర్ 20 : రోడ్డు భద్రతను పెంపొందించడం నేరాల నియంత్రణే లక్ష్యంగా మహేశ్వరం పోలీసులు విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా విప్రో జంక్షన్‌లో విస్తృత వాహన తనిఖీలు నిర్వహించారు. మహేశ్వరం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్. రఘువేంద్ర రెడ్డి పర్యవేక్షణలో సబ్-ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ సబ్-ఇన్‌స్పెక్టర్‌లతో పాటు పీటర్ మొబైల్-1, బీసీ-2 సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ తనిఖీల సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు రూ. 1,850 విలువైన ఈ-చలాన్లను విధించారు. అలాగే అనుమానితుల వివరాల తనిఖీ కోసం 'పాపిలాన్' పరికరాన్ని ఉపయోగించి 10 మంది వ్యక్తుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రఘువేంద్ర రెడ్డి





మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రయాణికుల సహకారం ఎంతో అవసరమని, సురక్షితమైన ప్రయాణం కోసం వాహనదారులు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని ఆయన కోరారు.

యుద్ధం మొదలైంది, హృదయ పీఠిక గ్రంథాల ఆవిష్కరణ.





నిజాంపేట్ ధరణి న్యూస్, సెప్టెంబర్ 20 -నిజాంపేట సర్కిల్ ప్రగతి నగర్ సుందరయ్య భవన్ లో అక్షర కుసుమాలు, భవానీ సాహిత్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం యుద్ధం మొదలైంది గ్రంథాన్ని ఆవిష్కరించారు . గ్రంథాన్ని ప్రముఖ కవి, మాజీ బీసీ కమిషన్ చైర్మన్ బి. ఎస్. రాములు పుస్తకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా సినీ గీత రచయిత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ స్వర్ణ నంది బహుమతి, ఉగాది పురస్కార గ్రహీత సాదనాల వేంకట స్వామి నాయుడు, సుందరయ్య భవన్ కన్వీనర్ శ్రీ సి. హెచ్ . మల్లయాచారి పత్రికా సంపాదకులు బైస దేవదాసు, ప్రముఖ కవి కాంచనపల్లి గోవర్ధన రాజు, పుస్తక ప్రచురణ కర్త వైరాగ్యం ప్రభాకర్, సమీక్షకులు శ్రీమతి వనజా బలుసాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొంత మంచికే చిత్ర దర్శకురాలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి సినీ మహిళా దర్శకురాలు శ్రీమతి నాగశ్రీ బాలదరి ని ఘనంగా సన్మానించారు. తరువాత కవి సమ్మేళనం లో పాల్గొన్న కవులను సత్కరించారు. ఈ కవి సమ్మేళనం లో డా. టి. లక్ష్మి, శ్రీమతి శ్రీదేవి, ప్రొఫెసర్ షహనాజ్ బతుల్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోల్ గడ్డపై మంత్రి దామోదర సందడి







- అభివృద్ధి, ఆధ్యాత్మికం, మానవత్వం

మేళవింపుగా పర్యటన

డాకూర్ చర్చి నుండి మార్వెల్లి వినాయక

మండపం వరకు.. ప్రతి చోటా నీరాజనాలు

మాజీ సర్పంచ్ విగ్రహావిష్కరణ..

అనారోగ్యంతో ఉన్న నేతను పరామర్శించి

మానవత్వం చాటిన మంత్రి



ఉమ్మడి ధరణి న్యూస్, సెప్టెంబర్ 20 -రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం ఆందోల్ నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలతో మమేకమయ్యారు.పర్యటనలో భాగంగా తొలుత ఆందోల్ మండలం డాకూర్ గ్రామంలోని సి ఎస్ ఐ చర్చిని సందర్శించారు. అక్కడ నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని రాష్ట్ర ప్రజల సుఖ సంతోషాల కోసం ప్రార్థించారు.అనంతరం వట్‌పల్లి మండలం ఉసిరికపల్లి గ్రామానికి చేరుకున్నారు. గ్రామ మాజీ సర్పంచ్ మన్నే నర్సింలు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మన్నే నర్సింలు గ్రామ అభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ జెడ్పీటీసీ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పట్లోళ్ల రాంరెడ్డి గారిని మంత్రి స్వయంగా వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని, ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మార్వెల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం గ్రామంలో శ్రీ సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో పిసిసి ఉపాధ్యక్షులు సంగమేశ్వర్, మండల పార్టీ అధ్యక్షులు విశ్వాస్, మాజీ అధ్యక్షులు రమేష్ జోషి, ఆత్మ కమిటీ చైర్మన్ కచుర్ రావు, జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్ మోహన్ రెడ్డి, ముఖ్య నాయకులు శేరి జగన్ మోహన్ రెడ్డి, సురేందర్ గౌడ్, దిగంబర్ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, అల్లాదుర్గ్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శేషా రెడ్డి, పెద్దపట్ల వినయ్ గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అన్నదానం.. గణనాథుడికి ప్రత్యేక పూజలు

గణేష్ మండలి అన్నదాన కార్యక్రమానికి పద్మా దేవేందర్‌రెడ్డి





మెదక్ ధరణి న్యూస్, సెప్టెంబర్ 20 :మెదక్ పట్టణంలోని హౌసింగ్ బోర్డులో శ్రీ ఛత్రపతి శివాజీ గణేష్ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. కార్యక్రమానికి మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి హాజరై భక్తులతో కలిసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న మండలి సభ్యులను పద్మా దేవేందర్‌రెడ్డి అభినందించారు. ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మాజీ జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ లావణ్యరెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్ ఆంజనేయులు, కౌన్సిలర్ స్వరూప, నాయకులు జీవన్‌రావు, మాయ మల్లేశం, సాయికుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు రాజీవ్, కేశు, నాగ, సంతోష్, శివ, శ్రవణ్‌రెడ్డి, పబ్బ శివ, బి. సంతోష్, రవి, సిద్ధు, నాగిరెడ్డి, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావంతో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి

విఘ్నేశ్వరుడికి మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు





మెదక్ ధరణి న్యూస్, సెప్టెంబర్ 20 -గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి సూచించారు. ఆదివారం హవేలీఘనపూర్ మండల కేంద్రంలోని భగత్‌సింగ్ గణేష్ మండపంలో ప్రతిష్ఠించిన గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న భగత్‌సింగ్ గణేష్ మండలి సభ్యులను అభినందించారు. ఉత్సవాలు ప్రశాంతంగా విజయవంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.అనంతరం గణేష్ మండలి సభ్యులు పద్మా దేవేందర్‌రెడ్డిని శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మ్యాకల సాయిలు, ఉపసర్పంచ్ వడ్ల రాజు, మాజీ జెడ్పీటీసీ వైస్‌చైర్‌పర్సన్ ఎం. లావణ్యరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, న్యాయవాది జీవన్‌రావు, నాయకులు, గణేష్ మండలి సభ్యులు, భక్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

4,30,000/- వేలు పలికిన వినాయకుని లడ్డు

లడ్డు దక్కించుకున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రావూరి మల్లేశ్వరరావు




నిజాంపేట్ ధరణి న్యూస్, సెప్టెంబర్ 20 -నిజాంపేట్ సర్కిల్‌నిజాంపేట్ 273 డివిజన్ బాలాజీ హిల్స్ నందు వినాయక చవితి పర్వదినం సందర్భంగా నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఏడు రోజులపాటు పూజలందుకున్న వినాయక స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని రూ. 4,30,000/- కు నాలుగు లక్షల 30 వేల రూపాయలకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రావూరి మౌలేశ్వరరావు దక్కించుకోవడం జరిగింది. కమిటీ వారు స్వామివారి శేష వస్త్రంతో వారిని సత్కరించి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయకుడి ఆశీస్సులతో ఈ పవిత్రమైన లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని వినాయక స్వామి ఆశీస్సులతో నిజాంపేట్ 273 డివిజన్ ప్రజలకు మరింత అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతానన్నారు. భగవంతుని ఆశీస్సులు ,ప్రజల ఆశీస్సులు, సహకారంతో ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో వినాయక కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి భారీగా బయలుదేరిన గణనాథులు








నిజాంపేట్ ధరణి న్యూస్, సెప్టెంబర్ 20 -0నిజాంపేట సర్కిల్ పరిధిలో గణేష్ పండగ సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయకుల నిమజ్జనాలు పాపయ్య కుంటలో పోలీసులు, హైడ్రా, మున్సిపల్ ఆధ్వర్యంలో నిమజ్జనం ఏర్పాట్లను నిర్వహించారు. నిన్న ఈరోజు ఆదివారం కావడంతో అపార్ట్మెంట్ వాసులు తమ అపార్ట్మెంట్లలో ఏర్పాటుచేసిన గణనాథులను భక్తిశ్రద్ధలతో పూజించి స్వామివారిని గంగమ్మ ఒడికి చేర్చారు . నిమజ్జన ప్రాంతంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు నిమజ్జన ప్రాంతంలో భారీ భద్రతను చేపట్టారు. అధిక సంఖ్యలో విగ్రహాలు రావడంతో భారీగా వాహనాలు రోడ్డుపైనే నిలపడంతో త్వర త్వరగా వినాయక నిమజ్జనాలను చేశారు. నిమజ్జనం ఏర్పాట్లను బాచుపల్లి ఏఎస్ఐ మల్లేష్, హైడ్రా అధికారి సతీష్ మున్సిపల్ అధికారి చరణ్ పరిశీలించారు.

ఎమ్ఆర్పీఎస్, ఎమ్ఎస్పీ
మండల అధ్యక్షులుగా జగపతి అంజయ్య మాదిగ...

శేరిలింగంపల్లి,ధరణి న్యూస్, సెప్టెంబర్ 20 -మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్ఆర్పీఎస్)ఎమ్ఎస్పీ వ్యవస్థాపకులు మందా కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శేరిలింగంపల్లి మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.ఎమ్ఆర్పీఎస్, ఎమ్ఎస్పీ మండల అధ్యక్షులుగా జగపతి అంజయ్య, రంగారెడ్డి జిల్లా ఇన్చార్జ్ రావుగళ్ళ బాబు మాదిగ ప్రకటించారు ,నూతన కార్యవర్గం ఎమ్ఆర్పీఎస్ ఎమ్ఎస్పీ రాజ్యాధికార సూచన మేరకు, అధికార ప్రతినిధిగా సాంసంగ్ మాదిగ, ఎమ్ఎస్పీ మండల అధ్యక్షులుగా సుదర్శన్ మాదిగ, ఎమ్ఎస్పీ అధికార ప్రతినిధిగా సింగారం దాసరి రాజు మాదిగ నియామకాలు జరిగాయి.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మందా కృష్ణ మాదిగ ఆశీస్సులతో, రాజ్యాధికార సూచన మేరకు ఎమ్ఆర్పీఎస్ /ఎమ్ఎస్పీ శేరిలింగంపల్లి మండల కార్యక్రమాలను బలోపేతం చేస్తామని, మాదిగ రిజర్వేషన్ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఐత రమేష్ మాదిగ, సింగ దాసరి,నరేష్ మాదిగ, రాజేష్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ సేవా పురస్కారం 2026 అందుకున్న
అమ్మ ఫౌండేషన్ కోశాధికారి సుధాకర్ యాదవ్

యాదాద్రి ధరణి న్యూస్, సెప్టెంబర్ 20 -తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ పట్టణంలోని పి.ఎస్. పంక్షన్ హాల్‌లో ఆదివారం భారత్ రక్తదాన్ సేవా మిషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ సేవా పురస్కారం--2026 సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.దక్షిణ భారతదేశంలోని ఐదు రాష్ట్రాలకు చెందిన రక్తదాతలు, సామాజిక సేవకులను వారి సేవలను గుర్తించి ఈ కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 320 సార్లు రక్తదానం చేసి ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందిన సంపత్ కుమార్ హాజరయ్యారు. భారత్ రక్తదాన్ సేవా మిషన్ అసోసియేషన్ సంస్థ వ్యవస్థాపకులు కురిమేటి నవీన్ చేతుల మీదుగా అమ్మ ఫౌండేషన్ కోశాధికారి పేరగాని సుధాకర్ యాదవ్ ఉత్తమ సేవా పురస్కారం--2026ను అందుకున్నారు.ఈ సందర్భంగా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ, అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత పది సంవత్సరాల కాలం నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక సేవా కార్యక్రమాలను దాతల సహకారంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం , వికలాంగులకు వీల్ చైర్స్ నిరుపేద కుటుంబాలకు ఆపన్నహస్తం మెడికల్ క్యాంపులు నిర్వహించడం తదితర అనేక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని చెప్పారు.ప్రజలకు, నిరుపేదలకు, అవసరంలో ఉన్న వారికి తమ వంతు సహాయం అందిస్తూ చేస్తున్న సేవలను గుర్తించి భారత్ రక్తదాన్ సేవా మిషన్ అసోసియేషన్ వారు ఉత్తమ సేవా పురస్కారం--2026తో సన్మానించడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందని అమ్మ ఫౌండేషన్ కోశాధికారి సుధాకర్ యాదవ్ తెలిపారు.ఈ పురస్కారం తనకు మాత్రమే దక్కిన గౌరవంగా కాకుండా, అమ్మ ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు నిరంతరం సహకరిస్తూ, ఆర్థికంగా మరియు వస్తు రూపంలో అండగా నిలుస్తున్న ప్రతి ఒక్క దాతకు అంకితం చేస్తున్నట్లు సుధాకర్ యాదవ్ తెలిపారు. దాతల సహకారం, ప్రోత్సాహం వల్లే మరింత మంది నిరుపేదలకు, అవసరంలో ఉన్న కుటుంబాలకు సేవలు చేయగలుగుతున్నామని అన్నారు.అత్యవసర సమయంలో రక్తం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఒక్క ప్రాణం కూడా రక్తం అందక పోవడం వల్ల కోల్పోకుండా ఉండేందుకు యువత ముందుకు వచ్చి రక్తదాతలుగా మారాలని ఆయన పిలుపునిచ్చారు.“రక్తదాతలుగా మారండి... ప్రాణదాతలుగా శాశ్వతంగా నిలిచిపోండి” అని యువతకు సందేశం ఇచ్చారు.రక్తదానంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండి సేవ చేయడం తనకు ఎంతో సంతోషంగా, మహాభాగ్యంగా భావిస్తున్నానని సుధాకర్ యాదవ్ తెలిపారు. భవిష్యత్తులో కూడా అమ్మ ఫౌండేషన్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ, దాతలు మరియు సేవాభిమానుల సహకారంతో అవసరమైన వారికి అండగా నిలుస్తామని పేర్కొన్నారు.



మట్టి గణపతులకు జై అందాం పర్యావరణాన్ని కాపాడుదాం





జాతీయ యువజన అవార్డు గ్రహీత

డాక్టర్ దేశబోయిని నర్సింహులు

మట్టి గణపతులను ప్రతిష్టించి పూజలు చేస్తున్న

నిర్వాహకులకు సన్మానం

సిద్దిపేట ధరణి న్యూస్, సెప్టెంబర్ 20 -పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతులను ప్రతిష్టించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్న కుక్కునూరుపల్లి మండలం చిన్నకిష్టాపూర్, ఎల్లయగూడ గ్రామాల గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులను సేవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత, సేవ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు డాక్టర్ దేశబోయిని నర్సింహులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా డాక్టర్ నర్సింహులు మాట్లాడుతూ.. పర్యావరణహితమైన మట్టి గణపతులను ప్రతిష్టించి వినాయక చవితి వేడుకలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా నీటి వనరులతో పాటు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు.

ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను ప్రతిష్టించి పర్యావరణ పరిరక్షణలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.

“మట్టి గణపతే మహాగణపతి -- మట్టి వినాయకుడిని పూజిద్దాం, పర్యావరణాన్ని పరిరక్షిద్దాం” అనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో యువజన సంఘాల నాయకులు సిద్దోజీ సంతోష్ కుమార్ చిన్నకిష్టాపూర్ గణేష్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు గోపాల్ రెడ్డి, సభ్యులు శ్రీనివాస్ చారి, శేఖర్ చారి, సుధాకర్, సందీప్ రెడ్డి, మధుబాబు, ఎల్లయగూడ గ్రామ సర్పంచ్ సున్నం సుదర్శన్, ఉపసర్పంచ్ జాని,సున్నం లక్ష్మణ్ ,కుర్మ యాదగిరి,గణేష్ యూత్ సభ్యులు బింగి అనిల్,పుల్ల స్వామి,మంద అశోక్ ,కొత్త అనిల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం దేవస్థానంలోనిసాంస్కృతిక కార్యక్రమాలు



నంద్యాల ధరణి న్యూస్, సెప్టెంబర్ 20 -దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధనలో) శ్రీమతి యం. లావణ్య మరియు వారి బృందం, హైదరాబాదు వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించబడుతున్నది.

ఈ కార్యక్రమములో గణపతికౌత్వం, నమశ్శివాయ, హర హర శంభో, మూషికవాహన, తాండవ నృత్యం, అఖిలాండేశ్వరి, శంభో శివశంభో తదితర గీతాలకు అక్షర, అక్షిత, నిత్యశ్రీ, వేదాంశిక, సహస్ర, నక్షత్ర, పవిత్ర తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నారు. కాగా ఈ నిత్య కళారాధనలో ఆయా రోజులలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించ బడుతున్నాయి.

గణపయ్యకు వీడ్కోలు.. గంగమ్మ ఒడికి తనయుడు..

బ్యాండ్, డీజే, లైటింగులతో హోరెత్తిన శోభాయాత్ర

దాండియా, కోలాటాలతో అలరించిన మహిళలు, చిన్నారులు





జోగిపేటధరణి న్యూస్, సెప్టెంబర్ 20 -జోగిపేట పట్టణ ప్రధాన రహదారి పక్కన శ్రీ పబ్బతి హనుమాన్ మందిరంలో వినాయక చవితి నాడు కొలువుదీరిన గణనాథుడు ఏడు రోజుల పాటు భక్తుల పూజలందుకొని నేడు గంగమ్మ ఒడికి చేరుకున్నాడు.
ఈ సందర్భంగా ఉదయం మందిరంలో ప్రత్యేక పూజలు, మంగళహారతులు నిర్వహించారు. అనంతరం మహిళలు, చిన్నారులు దాండియా, కోలాటం ఆటలతో అలరించారు. యువకులు బ్యాండ్ బాజా మేళాలు, డీజే లైటింగుల మధ్య జోరుగా స్టెప్పులేస్తూ ఉత్సవాన్ని హోరెత్తించారు. అనంతరం గణపయ్య శోభాయాత్రగా బయలుదేరింది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకుని ప్రసాదాలను స్వీకరించారు. శోభాయాత్ర పట్టణ పురవీధుల గుండా కోలాహలంగా సాగింది.చివరగా శోభాయాత్ర ఆందోల్ పెద్ద చెరువుకు చేరుకుంది. అక్కడ గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. ‘గణపయ్యా.. వెళ్లి రావయ్యా.. మమ్మల్ని ప్రజలందరినీ చల్లగా చూడయ్యా’ అంటూ భక్తులు వేడుకుంటూ గణనాథుడిని గంగమ్మ ఒడికి చేర్చి ఘనంగా నిమజ్జనం చేశారు.

274 వ డివిజన్ బీజేపీ అధ్యక్షురాలుగా మాజీ
కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు




నిజాంపేట్ ధరణి న్యూస్, సెప్టెంబర్ 20 -నిజాంపేట సర్కిల్ బాచుపల్లి 274 వ డివిజన్భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలుగా శ్రీమతి విజయలక్ష్మి సుబ్బారావును రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్ర రావు , మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ఆదేశాల మేరకు మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా అధ్యక్షులు డి గిరి వర్ధన్ రెడ్డి నియమించడమైనది.ఈ సందర్భంగా అనేకమంది జిల్లా మరియు నిజాంపేట్ సర్కిల్ నాయకులు విజయలక్ష్మి సుబ్బారావు కు శుభాకాంక్షలు తెలియజేయడమైనది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ పెద్దలు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు కి, పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ కు జిల్లా అధ్యక్షులు డి గిరివర్ధన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియ చేస్తూ నామీద నమ్మకము, విశ్వాసంతో నాకు బాచుపల్లి బిజెపి అధ్యక్షురాలుగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. నిజాంపేట సర్కిల్లో బిజెపి తలోపితం కోసం నేను సర్వశక్తుల కృషి చేస్తానని తెలిపారు. నాకు ప్రత్యక్షంగా పరోక్షంగా అభినందనలు తెలియజేసిన పార్టీ నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

వెంకట సాయి హోమ్స్ లో

రూ.3.20 లక్షలు పలికిన వినాయకుడి లడ్డూ





నిజాంపేట్, ధరణి న్యూస్, సెప్టెంబర్ 20 –హైదరాబాద్: నిజాంపేట్‌లోని వెంకట సాయి హోమ్స్ లో వినాయక ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన గణేశుడి లడ్డూ వేలంలో ఈ ఏడాది లడ్డూ రూ.3,20,000 పలికింది. విల్లా నం.43కు చెందిన కాకర్ల కుటుంబం ఈ లడ్డూను దక్కించుకుంది.శ్రీ కాకర్ల సాంబశివరావు , శ్రీమతి కాకర్ల శారద దంపతుల పేరిట లడ్డూను సొంతం చేసుకున్నారు. వెంకట సాయి హోమ్స్ లో గణేశ్ వేడుకల్లో భాగంగా జరిగిన ఈ వేలంలో కాకర్ల కుటుంబం రూ.3.20లక్షలకు లడ్డూను దక్కించుకోవడం ప్రత్యేకతగా నిలిచింది. ఉదయం అన్నదాన కార్యక్రమం నిర్వహించి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించినట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ రాంప్రసాద్, ధర్మారావు, కోటపాటి రమేష్, మూర్తి , హనుమంత్ రెడ్డి,శ్రీకాంత్, దుర్గా ప్రసాద్, పవన్ మాధవ్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, గుంటుపల్లి వంశీకృష్ణ, రావిపాటి గిరి. కాలనీవాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కర్బూజాపై గణనాథుడు రామకోటి రామరాజు భక్తికి కళారూపం

ఎన్నో చిత్రాలకు రూపమిచ్చిన రామకోటి సంస్థ

ప్రకృతిలో లభించే వస్తువులతో ఎ

భగవంతుని చిత్రాలు





సిద్దిపేట ధరణి న్యూస్, సెప్టెంబర్ 20 –వినాయక నవరాత్రుల వేళ భక్తికి కళను జోడిస్తూ వినూత్నంగా గణపతి చిత్రాన్ని ఆవిష్కరించారు సిద్దిపేట జిల్లా గజ్వేల్ కు చెందిన శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు. కర్బూజా కాయపై గణపతి చిత్రాన్ని అత్యంత సృజనాత్మకంగా చిత్రించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి ఉంటే ప్రకృతిలో లభించే ప్రతి వస్తువూ ఓ కళా వేదికే" అన్నట్లుగా కర్బూజా కాయపై గణపతి రూపాన్ని చిత్రించి భక్తిని చాటుకున్నారు రామకోటి రామరాజు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడిని నవరాత్రుల్లో భక్తిశ్రద్ధలతో పూజించడం ఆధ్యాత్మిక ఆనందాన్ని ఇస్తుందన్నారు. తనలోని ఆధ్యాత్మిక కళతో గత 30 ఏళ్లుగా భగవంతుని వివిధ రూపాలను వినూత్నంగా చిత్రిస్తున్నానని తెలిపారు. ప్రకృతిలో లభించే వస్తువులను సైతం భక్తికి మాధ్యమాలుగా మలచవచ్చని తన కళ ద్వారా చాటుతున్న రామకోటి రామరాజును భక్తులు అభినందించారు.

మట్టి గణపతితో శివానంద కాలనీ ఆదర్శం అభినందనీయం



భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత

రామకోటి రామరాజు

రామకోటి రామరాజు సేవకు

కాలని వాసుల ఘన సన్మానం





సిద్దిపేట ధరణి న్యూస్, సెప్టెంబర్ 20 – మట్టి గణపతిని ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణకు బాటలు వేసిన సిద్దిపేట జిల్లా కొండపాక మండలం కుకునూర్ పల్లి శివానంద కాలనీ వాసులను ఆదివారం నాడు శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు అభినందించి ఘనంగా సన్మానించారు. సీతారాముల చిత్రపటాన్ని అందజేసి వారి భక్తి సంకల్పాన్ని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా రామకోటి రామరాజు మాట్లాడుతూ భక్తితో పాటు ప్రకృతిని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మట్టి గణపతిని ప్రతిష్ఠించడం ద్వారా సాంప్రదాయాన్ని గౌరవించడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు కూడా సందేశం ఇస్తున్నారన్నారు. మట్టి గణపతుల మీద ప్రతి గ్రామం, ప్రతి కాలనీని ప్రోత్సహించడం రామకోటి రామరాజు చేస్తున్న సేవ అమోఘం అని కాలని వాసులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్రజా కళా జాతర కరపత్రం ఆవిష్కరించిన విమలక్క



హైదరాబాద్, ధరణి న్యూస్, సెప్టెంబర్ 20 – ప్రజా కళా జాతర కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని హైదరాబాద్‌లో ఆదివారం ఆవిష్కరించారు.యాభై రెండేళ్ళ అరుణోదయలో యాభై ఏళ్ళ విమలక్క ప్రస్థానం 50 గంటల పాటు ఏకధాటిగా పాటా-ఆటా-మాటలతో సాగేప్రజాకళా జాతర ఈ నెల 26, 27, 28 తేదీల్లోనిర్జీసి కళ్యాణమండపం, (అరుణోదయ నాగన్న ప్రాంగణం) బాగ్లింగంపల్లి, హైదరాబాద్‌లోనిర్వహించనున్న ప్రజా కళా జాతర కార్యక్రమం ప్రచారంలో భాగంగా కరపత్రాన్ని విడుదల చేశారు.ఈ కార్యక్రమానికిముఖ్య అతిథిగాఅరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవాధ్యక్షురాలుహా విమలక్కహా హాజరై కరపత్రాన్ని ఆవిష్కరించారు.ప్రజా కళా జాతరను విజయవంతం చేయాలని, ప్రజా కళాకారులు, సాంస్కృతిక కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రజా కళలు, సాంస్కృతిక ప్రదర్శనలు, కళాకారుల సన్మానాలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ప్రజా కళా ఉద్యమంలోఅందించిన సేవలను స్మరించుకుంటూ 50 ఏళ్ల ప్రస్థానాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నవ తెలంగాణ యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బిజిగిరి నవీన్ కుమార్,అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర నాయకులు ఏపూరి మల్సూర్, అనిత, రాకేష్ సౌమ్య,ప్రజా సంఘాల నాయకులు, సాంస్కృతిక కార్యకర్తలు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

రామ్ సేనా యూత్ ఆధ్వర్యంలో 'ఇరుముడి'

సినిమా ప్రదర్శన



దుబ్బాక ధరణి న్యూస్, సెప్టెంబర్ 20 –దుబ్బాక మండలం రామక్కపేట గ్రామంలో రామ్ సేనా యూత్ ఆధ్వర్యంలో 'ఇరుముడి' సినిమా ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత పాల్గొని సినిమాను ఆసక్తిగా వీక్షించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ.. భారతీయ కుటుంబ విలువలు, సమాజం ఎలా ఉండాలి అనే విషయాలను 'ఇరుముడి' సినిమా కళ్లకు కట్టినట్టుగా చూపించిందని తెలిపారు. పిల్లలు తల్లిదండ్రులతో ఎలా మెలగాలి, కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలు ఎలా ఉండాలి అనే విషయాలను ఈ సినిమా ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు. కుటుంబ వ్యవస్థ ఎలా ఉండాలి, కుటుంబ విలువలను ఎలా కాపాడుకోవాలి అనే విషయాలను ఈ సినిమా చక్కగా చూపించిందని పేర్కొన్నారు. సినిమాలోని సందేశాత్మక దృశ్యాలను చూసి గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. సినిమా మంచి సందేశాన్ని అందించిందని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో రామ్ సేనా యూత్ సభ్యులు క్రాంతి కుమార్, అజయ్, వంశీ,సాయి రాజ్,హరీష్, రాజు, మిద్దె నరేష్,అఖిల్, ప్రకాష్,కమల్, అశ్విత్, యశ్వంత్, నవదీప్, వినయ్, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన గ్రామ ప్రజలకు రామ్ సేనా యూత్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీశైలం దేవస్థానంలోని పల్లకీ ఉత్సవం



నంద్యాల ధరణి న్యూస్, సెప్టెంబర్ 20 –లోకకల్యాణంకోసం దేవస్థానం ఈ రోజు (20.09.2026) రాత్రి శ్రీ స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవం నిర్వహిస్తుంది.

ఈ పల్లకీ ఉత్సవం ప్రతి ఆదివారం, పౌర్ణమి మరియు మూలా నక్షత్రం రోజులలో దేవస్థాన సేవగా (సర్కారి సేవగా) జరిపించబడుతుంది.


ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవాసంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది.

అనంతరం శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో వేంచేబు చేయించి శాస్త్రోక్తంగా షోడశోపచారపూజలు జరిపించబడ్డాయి.

అన్నప్రసాదవితరణ పథకానికి శ్రీ జొన్నలగడ్డ

నారాయణమూర్తి తెనాలి వారు

నంద్యాల ధరణి న్యూస్, సెప్టెంబర్ 20 –రూ. 1,00,000/–లు విరాళాన్ని విరాళంగా



అందజేశారు. ఈ మొత్తాన్ని కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావుకు అందజేశారు. దాతకు తగు రశీదు, ప్రసాదాలు అందజేయబడ్డాయి.

రైతు బజార్ లో పారిశుద్ధ్య లోపాలు పాడైన కూరగాయల పై కాలు పెట్టి

జారిపడి మహిళ కు గాయాలు

అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



కూకట్ పల్లి, ధరణి న్యూస్, సెప్టెంబర్ 20 –కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ జేఎన్‌టీయూ సమీపంలోని రైతు బజార్‌లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది రైతు బజార్‌కు కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చిన ఓ మహిళ అక్కడ నేలపై పేరుకుపోయిన పాడైన కూరగాయలపై కాలు పెట్టడంతో అదుపుతప్పి జారిపడి కిందపడిపోయినట్లు స్థానికులు తెలిపారుఈ ఘటనలో మహిళ వెన్నుపూసకు బలమైన గాయం అయినట్లు సమాచారం ప్రమాదాన్ని గమనించిన అక్కడి వ్యాపారులు, ప్రజలు వెంటనే ఆమెను సమీపంలోని రాందేవ్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నారురైతు బజార్‌లో పాడైపోయిన కూరగాయలు వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ వాటిని సకాలంలో తొలగించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు కూరగాయల కోసం రైతు బజార్‌కు వస్తుంటారని, ఇలాంటి ప్రదేశాల్లో పారిశుద్ధ్య నిర్వహణ నేల శుభ్రత వ్యర్థాల తొలగింపు విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారుఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జవీజ అధికారులు వెంటనే రైతు బజార్‌ను పరిశీలించి పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరచాలని, పాడైన కూరగాయలు మరియు వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారుఅదేవిధంగా రైతు బజార్ లోని నేలపై జారే పదార్థాలు పేరుకు పోకుండా క్రమం తప్పకుండా శుభ్ర పరిచేలా సిబ్బందిని ఏర్పాటు చేయడంతో పాటు ప్రజల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.


DHARANI NEWS DAILY
ధరణి న్యూస్
www.dharaninews.com
తెలుగు దినపత్రిక

రోబోల యుగానికి కెరియర్ రోడ్!

అత్యాధునిక సాంకేతికతలు దూసుకొస్తూ వివిధ రంగాల్లో పెనుమార్పులు తెస్తున్నాయి. ఉద్యోగాల తీరుతెన్నులను గణనీయంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ పరిణామం మున్ముందు ఇంకా వేగవంతమవుతుంది. అందుకే సంప్రదాయ పంథాలో కెరియర్ ప్రణాళిక చేద్దామంటే ఇప్పుడు ఏమాత్రం సరిపోదు. నవతరం విద్యార్థులు తాము ఎదుర్కొనబోయే సవాళ్లకు దీటుగా తయారవ్వాలి. అందుకే భవిష్యత్ సామర్థ్యాలు నేర్చుకుంటూ.. వాటికి సానపెట్టుకునేలా కెరియర్ ఎంపిక ఉండాలి!







ఒక అభ్యర్థిని ఉద్యోగానికి ఎంపిక చేయాలంటే పరీక్షలు పెట్టి, మార్కుల లెక్కలు కట్టి, ఇంటర్వ్యూకి పిలిచి నఖశిఖ పర్యంతం పరిశీలిస్తారు. పరిజ్ఞానాన్ని తెలుసుకోడానికి పలు ప్రశ్నలు వేస్తారు. భవిష్యత్తులో సెలక్షన్లు అలాంటి సంప్రదాయ పద్ధతుల్లో ఉండవు. రోబోలు, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తదితర టెక్నాలజీల సాయంతో వ్యక్తి ప్రజ్ఞను వేగంగా అంచనా వేస్తారు. అంతర్జాలంలో అనంతంగా అందుబాటులో ఉన్న సమాచారంలో అవసరమైనదాన్ని తీసుకొని ఉపయోగించుకోగలిగిన సామర్థ్యాలను లెక్కగడతారు. సమాచార నిల్వ, ప్రాసెసింగ్‌ల్లో యంత్రాలను దాటి మనిషి నిలబడలేడు. కానీ సృజనాత్మకంగా, మానవీయ కోణంలో ఆలోచించగలిగిన తీరు మాత్రం మనిషికే సొంతం. రాబోయే తరాలు అలాంటి నైపుణ్యాలను నేర్చుకుంటేనే అవకాశాలను అందుకోగలుగుతాయి. నిజానికి రానున్న కాలంలో చదువులు, ఉద్యోగాల రూపమే మారిపోబోతోంది. ఇప్పుడున్న వాటిల్లో 75 శాతం వరకూ మాయమైపోతాయి. కొత్త కొత్త పేర్లతో ఎన్నో కోర్సులు, ఉద్యోగాలు పుట్టుకొస్తాయి. ఏం వస్తాయో, ఎలా వస్తాయో తెలియని వాటికి ఎలా సిద్ధం కావాలి? ఈ ప్రశ్నకు సమాధానమే ఇంటర్ డిసిప్లినరీ విధానం. అంటే పరస్పరాధారితంగా ఉన్న ఒకటి కంటే ఎక్కువ విజ్ఞాన శాఖల్లో సామర్థ్యాన్ని సంపాదించడం. దీనికి ఆదరణ పెరుగుతోంది. కాబట్టి, దీనికి తగ్గట్టుగా కెరియర్ ప్లానింగ్ ఉండాలి. అలాగే నేటి పోటీ ప్రపంచంలో పిల్లలు రాణించాలన్నా, భవిష్యత్తులో చక్కటి కొలువులో స్థిరపడాలన్నా చిన్నప్పటి నుంచే వారికి కొన్ని నైపుణ్యాలు, సామర్థ్యాలను నేర్పించాలి.

పిల్లలకు నేర్పించాల్సిన నైపుణ్యాలు

పరిశీలన (అబ్జర్వేషన్): పిల్లలకు పరిశీలనా శక్తి పెరిగేలా చేయాలి. ఇంట్లో ఉన్నా, పార్కుకు లేదా ఏదైనా కొత్త ప్రాంతానికి తీసుకెళ్లినా వాళ్లను అక్కడున్న పరిసరాలను జాగ్రత్తగా గమనించమనాలి. దాన్నుంచి వాళ్లేం గ్రహించారో చెప్పమనాలి. అప్పుడప్పుడూ వారితో చర్చించాలి. పిల్లలు పాఠశాల వెలుపల, బయట రెండుచోట్లా తమ పరిశీలనా శక్తిని పెంపొందించుకునేలా చూడాలి.
వినగలిగే నేర్పు (లిసనింగ్): ఎదుటివారు చెప్పేది శ్రద్ధగా విని, అర్థం చేసుకుని తమకు కావాల్సిన విధంగా పిల్లలు ఉపయోగించుకోగలగాలి. చాలామంది పూర్తిగా వినకముందే ఒక నిర్ణయానికి వచ్చేస్తారు. అది సరికాదు. పిల్లలకు ఈ స్కిల్స్ అలవడాలంటే కథలు చెబుతూ, మధ్యలో వాళ్లను ప్రశ్నించాలి. తద్వారా చెప్పింది వాళ్లు వింటున్నారా? ఏం అర్థం చేసుకున్నారు లాంటివి తెలుస్తాయి. చదవడం (రీడింగ్): పాఠ్య పుస్తకాలే కాకుండా, పాఠ్యేతర పుస్తకాలు చదివేలా పిల్లలను ప్రోత్సహించాలి. ఇది వాళ్ల వాళ్ల స్థాయిని బట్టి జరగాలి. ప్రాథమిక స్థాయిలో ఉంటే కథల పుస్తకాలు, హైస్కూల్ స్థాయి విద్యార్థులైతే సైన్స్ ఫిక్షన్ లేదా సోషల్ స్టడీస్‌కు సంబంధించిన జనరల్ పుస్తకాలు, వాళ్ల ఆసక్తిని బట్టి చదివేలా చూడాలి. ఇలా చదవడం వల్ల అవగాహనా శక్తి, భాషపై పట్టు పెరుగుతాయి.
రాయడం (రైటింగ్): రాయడం అంటే భావ వ్యక్తీకరణ. భావాన్ని అవతలి వారికి అర్థమయ్యేలా చెప్పగలగాలి. అందుకు రాయడం ఒక మార్గం. కాబట్టి పిల్లల్లో రిన్ స్కిల్స్ పెంపొందించాలి. వివిధ వ్యాస రచన, ఇతర పోటీల్లో పాల్గొనేలా చేయాలి. వ్యక్తపరిచే సామర్థ్యాన్ని వృద్ధి చేసుకునే విధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సాయం చేయాలి.
ఏకాగ్రత (కాన్‌సన్‌ట్రేషన్): పని ఏదైనా దాన్ని ఏకాగ్రతతో చేయడం పిల్లలకు అలవాటు చేయాలి. ఉదాహరణకు అన్నం తింటుంటే ఆ రుచిని ఆస్వాదించాలి. తరగతిలో టీచర్ పాఠం చెబుతున్నట్లయితే శ్రద్ధగా వినాలి. అర్థం చేసుకోవాలి. ఏవైనా సందేహాలు వస్తే ఉపాధ్యాయుడిని అడిగి నివృత్తి చేసుకోవాలి.
అవగాహన (కాంప్రహెన్షన్): ఏదైనా చదివినప్పుడు/ విన్నప్పుడు/ చూసినప్పుడు పిల్లలు దానిపై సొంత అవగాహన ఏర్పరచు కోగలగాలి.

ఉద్యోగసాధనలో ఇది చాలా అవసరం.

విశ్లేషణ (అనలిటికల్): పిల్లలకు విశ్లేషణా సామర్థ్యాలు (అనలిటికల్ స్కిల్స్) కూడా ఉండాలి. చదివిన విషయాన్ని వివిధ కోణాల్లో ఎలా ఆలోచించి, విశ్లేషించుకోవాలో నేర్పించాలి.
అనువర్తన (అప్లికేషన్): ఏ అంశాన్నయినా నేర్చుకోవడం ఒక్కటే కాదు. దాన్ని ఉపయోగించి చుట్టూ ఉన్న సమస్యలకు పరిష్కారం కనుక్కోగలగాలి.దీన్ని పిల్లల్లో చిన్నప్పటి నుంచే పెంపొందించాలి.

రేపటికి దీటుగా రాణించాలంటే!

రాబోతున్న రోబోటిక్ విప్లవాన్ని దృష్టిలో ఉంచుకుని పిల్లలకు అలవర్చాల్సిన కొన్ని ఫ్యూచరిస్టిక్ (భవిష్యత్) సామర్థ్యాలున్నాయి. లైఫ్ స్కిల్స్‌లో భాగంగా ఇప్పటికి ఉన్నవాటితోపాటు కొత్తగా కొన్నింటిని నేర్పించాలి.
విమర్శనాత్మకంగా ఆలోచించడం (క్రిటికల్ థింకింగ్): శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం కారణంగా సామాజిక మాధ్యమాల్లో అధిక సమాచారం పోగవుతోంది. అందులో ఏది ఎంచుకోవాలి? ఎంత తీసుకోవాలి, పరిణామాలేంటి అని విమర్శనాత్మకంగా ఆలోచించగల సామర్థ్యం పిల్లలకు ఉండాలి. కేవలం పాఠాల పరిజ్ఞానానికి పరిమితం కాకూడదు. ప్రశ్నించే తత్వాన్ని పిల్లలకు అలవాటు చేయాలి. దాని వల్ల విమర్శనాత్మకంగా ఆలోచించగలిగే సామర్థ్యం వారిలో పెరుగుతుంది.
సామాజిక ప్రజ్ఞ (సోషల్ ఇంటలిజెన్స్): చుట్టూ ఉన్న వ్యక్తుల ఆలోచనలను, హావభావాలను పిల్లలు సరిగా అర్థం చేసుకునేలా చూడాలి. ఇంటర్నెట్ వాడకం విస్తృతమైన నేటి పరిస్థితుల్లో అవతలి వ్యక్తిని చూడకపోయినా వారు పంపిన సమాచారాన్ని బట్టి అవగాహన ఏర్పరచుకోగలగాలి. వారి మన్నన, విశ్వాసం పొందాలి. అప్పుడే వ్యక్తులతో దృఢమైన బంధాలు ఏర్పడతాయి. ఇలాంటి సామాజిక ప్రజ్ఞను పిల్లల్లో ఎలా పెంపొందించాలంటే – పిల్లలకు చిన్నప్పటి నుంచి కథలు చెప్పాలి. అందులోని పాత్రల ఆలోచనలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకునే అవకాశం కల్పించాలి. అలాగే ఇంటికి బంధువులు, స్నేహితులు రాగానే పిల్లలను లోపలికి పొమ్మనడం, పుస్తకం చదువుకోమనడం సరికాదు. నలుగురితో కలవనివ్వాలి. అవతలి వ్యక్తిని ఆకట్టుకోవడం, విశ్వాసాన్ని పొందడం వంటి సామాజిక ప్రజ్ఞలను పిల్లల్లో పటిష్ఠం చేయాలి.
మిశ్రమ సంస్కృతీ సామర్థ్యం (క్రాస్ కల్చరల్ కాంపిటెన్సీ): ప్రపంచీకరణ నేపథ్యంలో నిత్యం విభిన్న దేశాలు/ ప్రాంతాలు, సంస్కృతుల నుంచి వచ్చిన వ్యక్తులతో కలిసి పని చేయాల్సి ఉంటుంది. సహోద్యోగుల సంస్కృతిని సరిగా అర్థం చేసుకోగలగాలి. అప్పుడే వారు బహుళ సంస్కృతుల్లో ఇమడగలుగుతారు. పిల్లలను ప్రాంత, కుల, మత, వర్గ భేదాలకు దూరంగా ఉంచాలి. సంకుచితమైన భావాలను వారిపై రుద్దకూడదు. తమ సంస్కృతి, భాషలను అభిమానిస్తూనే అవతలి వ్యక్తులతో సామరస్యంగా వ్యవహరించే సామర్థ్యాన్ని పిల్లల్లో పెంపొందించాలి.
బహుళ సబ్జెక్టుల పరిజ్ఞానం (ట్రాన్స్‌డిసిప్లినారిటీ): ఈ పోటీ ప్రపంచంలో పిల్లలకు అనేక డిసిప్లిన్స్ తెలిసి ఉండాల్సిందే.
అన్ని సబ్జెక్టులపై కనీస పరిజ్ఞానం ఉండాలి. సంక్లిష్ట సమస్యలకు పరిష్కారం కనుక్కోవడానికి ట్రాన్స్‌డిసిప్లినారిటీ అవసరం. అంటే పిల్లల్లో ఇచ్చిన విషయాన్ని విశ్లేషించుకోవడం తెలిస్తేనే ఒక సబ్జెక్టికి మరొక సబ్జెక్టికి అనుసంధానం ఏమిటో వాళ్లకు అర్థమవుతుంది.
సహానుభూతి (ఎంపతీ): అవతలి వ్యక్తుల స్థానంలో తమను ఊహించుకుని, వారి ఆలోచనలను అర్థం చేసుకోగలిగే సామర్థ్యం పిల్లలకు ఉండాలి. మనుషుల మధ్య సంబంధాలు పటిష్ఠంగా ఉండాలంటే సహానుభూతి చాలా అవసరం. వీలున్నప్పుడు వారిని అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలకు తీసుకు వెళ్లాలి. సమాజంలో రకరకాల అవసరాలు/ సమస్యలు ఉన్న పిల్లలు/ వ్యక్తులు ఉంటారు. పిల్లలను వాళ్ల వయసుకు తగినట్లు ఆయా ప్రాంతాలకు తీసుకువెళ్తే అక్కడి వ్యక్తుల కోణంలో వారిని అర్థం చేసుకునే అవకాశం ఏర్పడుతుంది. పరిస్థితులకు అనుగుణంగా మారడం (మెంటల్ ఎలాస్టిసిటీ): మార్పులకు అనుగుణంగా మారి మసలగల సామర్థ్యాన్ని పిల్లల్లో పెంచాలి. దాన్నే ఎడాప్టబిలిటీ అంటారు. అంటే పరిస్థితుల ప్రకారం సర్దుకుపోవడం. దీనికి మానసికంగా సిద్ధం కావడాన్ని మెంటల్ ఎలాస్టిసిటీ అంటారు. ఉదాహరణకు స్కూల్లో పిల్లల సెక్షన్ మారిస్తే తమ స్నేహితులు దూరమవుతారని బాధపడతారు. కానీ కొత్త సెక్షన్‌లో కొత్త స్నేహితులు ఏర్పడతారనే ఆలోచన కలిగించాలి. మార్పు ఎంత అనివార్యమో, దాన్ని ఎలా ఆహ్వానించాలో, అందులోని మంచిని ఎలా అంగీకరించాలో, చెడు ఉంటే ఎలా దూరం పెట్టాలో పిల్లలకు నేర్పించాలి.
సంక్లిష్ట సమస్యల పరిష్కారం (కాంప్లెక్స్ ప్రాబ్లమ్ సాల్వింగ్): సంక్లిష్టమైన సమస్యలు వచ్చినప్పుడు విభిన్నంగా ఆలోచించటం అవసరం. వినూత్న పరిష్కారాలను కనుక్కోగలిగిన లేటరల్ థింకింగ్ పిల్లల్లో పెంపొందించాలి.

మౌఖిక విజయానికి ముందస్తు వ్యూహం! నైపుణ్య



మార్కుల్లో మనమే టాప్ మౌఖికం (ఇంటర్వ్యూ) మనకు లెక్కే లేదు అంటూ తల ఎగరేస్తే మొదటికే మోసం వచ్చేస్తుంది. ఇంటర్వ్యూ తలరాతలను తారుమారు చేసేస్తుంది. అడుగు దూరం వరకు వచ్చిన ఆఫర్ లెటర్‌ను అందకుండా చేసేస్తుంది. అప్పటికప్పుడు జవాబులు అవే వస్తాయనే అతి విశ్వాసానికిపోతే అనర్థం తప్పదు. సబ్జెక్టు ఒకసారి చూసుకుంటే సరిపోతుందనే నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తే నష్టం ఖాయం. అందుకే ఇంటర్వ్యూ బోర్డును ఆకట్టుకోవాలంటే సబ్జెక్టుతోపాటు ఆయా సంస్థల గురించి తెలుసుకోవాలి. మన గురించి మనం మార్కెట్ చేసుకోవడం నేర్చుకోవాలి.

ఇంజినీరింగ్ కళాశాలల్లో మొదలైన క్యాంపస్ రిక్రూట్‌మెంట్లకు హాజరయ్యే అభ్యర్థులు, ప్రైవేటు కంపెనీల్లో హెచ్ఆర్ రౌండ్‌ను ఎదుర్కొనేవారు ఈ అదనపు సన్నద్ధతను అనుసరిస్తే విజయం వారి వెంటే వస్తుంది.
ఏసంస్థ అయినా అభ్యర్థి గురించి నేరుగా తెలుసుకోవడానికే ఇంటర్వ్యూ నిర్వహిస్తుంది. సంస్థ అవసరాలకు అభ్యర్థి సరిపోతాడా లేదా అని తెలుసుకోవడమే ప్రధాన లక్ష్యం. కాబట్టి, వేసుకునే దుస్తులు, సాధారణంగా అడిగే ప్రశ్నలకు జవాబులు సిద్ధం చేసుకున్నంతమాత్రాన సరిపోదు. సంస్థ గురించీ, చేరబోయే స్థానం గురించీ తెలుసుకోవాలి.
అభ్యర్థి వివరాలూ, పరిజ్ఞానం సంస్థకు అవసరం కానీ, సంస్థ వివరాలు అభ్యర్థికి ఎందుకు అవసరమవుతాయి? ఈ సందేహం చాలామందిలో ఉంటుంది. కానీ, కంపెనీ విధానం, ఎంపిక చేసుకునేవారిలో ఏం చూస్తుంది వంటి విషయాలను తెలుసుకోవటం వల్ల స్పష్టత వస్తుంది. ఈ పరిశోధన గానీ, అవగాహన గానీ... సంస్థ అభ్యర్థిలో కోరుకునే అంశాలు తెలుసుకోవడానికీ, అభ్యర్థి తాను సంస్థలో ఇమడగలడో లేదో అర్థం చేసుకోవడానికే కాదు.. మిగతావారితో పోల్చినపుడు ముందంజలో ఉండటానికీ తోడ్పడుతుంది.
ఇంటర్వ్యూ సమయంలో హెచ్ఆర్ అధికారి సందేహాలుంటే అడగమని అభ్యర్థిని అడుగుతుంటారు. అభ్యర్థికి సంస్థ గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి, ఉత్సుకతా ఎంతవరకూ ఉన్నాయో తెలుసుకోవడమే ఈ ప్రశ్న వెనుక ఉద్దేశం. సంస్థ గురించిన కనీస అవగాహన ఉన్నప్పుడే వేటిని అడగాలో, అడగొచ్చో తెలుస్తుంది. ఇంతకీ ఇంటర్వ్యూకు వెళ్లేముందు ఏ విషయాల గురించి కనీసంగా తెలుసుకోవాలంటే..

సంస్థ ఏం చేస్తుంది?

ఇది తెలిసిన విషయమేగా అనిపిస్తుంది. ఉదాహరణకు ఒక సాఫ్ట్‌వేర్ సంస్థకు దరఖాస్తు చేసుకున్నారు అనుకుందాం. సాఫ్ట్‌వేర్ అంటే ఒక్క ప్రోగ్రామింగే ఉండదు కదా! కాబట్టి, ఆ సంస్థ దేనిపై పనిచేస్తుందో, ఏ సేవలు అందిస్తుందో క్షుణ్ణంగా తెలుసుకునుండాలి. హైరింగ్ మేనేజర్లు చాలావరకూ.. సంస్థ గురించి ఏం తెలుసో చెప్పమని అడుగుతుంటారు. దాని ఉద్దేశం అభ్యర్థి ఆసక్తి, పరిశ్రమపై అతనికున్న పరిజ్ఞానాన్ని తెలుసుకోవడమే! ఈ ప్రశ్నకు సరైన సమాధానం లేకపోతే.. 'సంస్థ గురించి పట్టించుకునే ఉద్దేశం లేదు.. ఉద్యోగ సాధనే అభ్యర్థి ఏకైక లక్ష్యం' అనే దురభిప్రాయం ఏర్పడుతుంది.

ఉద్యోగ బాధ్యతలేంటి?

దరఖాస్తు చేసే స్థానానికి సంబంధించిన సమాచారాన్నంతా ఇంటర్వ్యూకు ముందే తెలుసుకునే ప్రయత్నం చేయాలి. ఇలా చేయడం ద్వారా ఏయే అంశాలపై సిద్ధమవ్వాలో తెలుస్తుంది. అలాగే సంబంధిత స్థానానికి మీరే ఎలా తగినవారో మెరుగ్గా వివరించడానికి వీలూ ఉంటుంది.

వినియోగదారులెవరు?

ఒక సంస్థనూ, దాని శక్తిసామర్థ్యాలనూ దాని వినియోగదారులను బట్టి అంచనా వేయొచ్చు. సంస్థ ఏ ప్రొడక్ట్‌లను, సర్వీస్‌లను అందిస్తోందో తెలుసుకోవాలి. సంస్థ వినియోగదారులనూ, వారి అవసరాలనూ అర్థం చేసుకోగలరన్న అభిప్రాయాన్ని కలుగజేయగలగాలి. అప్పుడే పరిజ్ఞానమున్న ఉత్సాహవంతుడైన అభ్యర్థిగా ఇంటర్వ్యూ అధికారి మిమ్మల్ని పరిగణిస్తారు. చాలా సంస్థలు తమ వినియోగదారుల్లో ప్రముఖమైన వారి వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచుతుంది. ఆ సమాచారం సన్నద్ధతకు పనికొస్తుంది.

గమనించాల్సినవేంటి?

చాలావరకూ ఇంటర్వ్యూ అధికారులు అభ్యర్థులకు తమ సంస్థ గురించిన ప్రాథమిక సమాచారం తెలిసుండాలని భావిస్తుంటారు. మీరు దానికి అదనంగా పరిశ్రమలో వస్తున్న కొత్త ధోరణుల గురించి కూడా తెలుసుకుని ఉంటే మంచిది. కంపెనీ ఇప్పుడు ఏ స్థానంలో ఉంది, కొత్తగా ఏ మార్పులను చేపట్టబోతోందన్నవాటిపై అవగాహన తెచ్చుకోండి. ఉదాహరణకు– సంస్థ ఏదైనా కొత్త ప్రొడక్ట్‌ను/ సర్వీసులను ప్రవేశపెట్టబోతోందా? వాటికి ఏదైనా గుర్తింపు/ అవార్డులు వచ్చాయా? వంటివి తెలుసుకోవాలి.

లీడర్లు ఎవరు?

సంస్థ నాయకత్వ బృందంలో ఉన్న సభ్యుల గురించి తెలుసుకోవాలి. అంటే సంస్థలో పెద్ద స్థానాల్లో ఉండి, కీలకపాత్ర పోషించేవారి వివరాలను తెలుసుకోవాలి. మేనేజర్లు, డిపార్ట్‌మెంట్ డైరెక్టర్లు, సీఈఓ.. ఇలా వారి గురించి తెలుసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న ఉద్యోగాన్ని బట్టి ఒక్కోసారి వారిని ఇంటర్వ్యూలో కలిసే అవకాశమూ రావొచ్చు. ఇంటర్వ్యూ అధికారికి మీరు తగినంత సన్నద్ధమై వచ్చారని చెప్పడానికే కాదు.. సంస్థ విలువలు, సంస్కృతి గురించి తెలుసుకోవడానికీ ఈ సమాచారం పనికొస్తుంది. కేవలం సంస్థకు సంబంధించిన ఈ సమాచారంతోనే హెచ్ఆర్‌ను కొంతవరకూ ఆకట్టుకోవచ్చు.

పరిశోధన ఎలా?

వెబ్‌సైట్లు: ప్రతి కంపెనీకీ తమకంటూ వెబ్‌సైట్ ఉంటోంది. దానిలో సంస్థకు సంబంధించిన పూర్తి సమాచారం ఉంటోంది. కంపెనీ చరిత్ర దగ్గర్నుంచి వారి ప్రొడక్ట్, సర్వీసులు, మేనేజ్‌మెంట్, చివరికి సంస్థ సంస్కృతి మొత్తం అక్కడే దొరుకుతుంది. సాధారణంగా ఈ సమాచారమంతా 'ఎబౌట్ అజ్'లో దొరుకుతుంది. అలాగే కార్పొరేట్ విలువలు, సంస్థ తమ గురించి చెప్పడానికి ఎక్కువగా ఉపయోగిస్తున్న పదాలను గమనించుకోవాలి.
సోషల్ మీడియా: సంస్థలకు సోషల్ మీడియా అకౌంట్లు ఉన్నాయేమో చూసుకోవాలి. వారికి సంబంధించిన ఫేస్‌బుక్, ట్విటర్, ఇన్‌స్టాగ్రామ్.. అన్ని ఖాతాలను చూడాలి. వాటిల్లో చేరొచ్చు కూడా. వినియోగదారులను ఆకర్షించేలా ఏయే పోస్టింగులు పెడుతున్నాయో గమనించడానికి ఇది సాయపడుతుంది.

DHARANI NEWS DAILY
ధరణి న్యూస్
www.dharaninews.com
తెలుగు దినపత్రిక

మన ఆరోగ్యం బాగుండాలంటే రోజూ తినే ఆహారంలో ఎన్నో రకాల పోషకాలు ఉండాల్సిందే. ఆహారంలోని కార్బోహైడ్రేట్లు, కొవ్వులు శక్తినిచ్చినా.. మన శరీరంలోని అన్ని అవయవాలు సరిగా పనిచేయాలంటే విటమిన్లు, ప్రొటీన్లు, అమైనో ఆమ్లాల వంటి పోషకాలు కూడా అందాలి. వీటితోపాటు కొన్ని ఖనిజ లవణాలూ శరీరానికి అత్యవసరం. వాటిలోనూ స్థూల పోషకాలు, సూక్ష్మ పోషకాలు లేదా ట్రేస్ మినరల్స్ అని రెండు రకాలు. కాల్షియం, సోడియం, పొటాషియం, క్లోరిన్ (క్లోరైడ్), మెగ్నీషియం, ఫాస్ఫేట్ లు స్థూల పోషకాలు. శరీరంలో ఎముకలు, కండరాలు, గుండె, మెదడుల పనితీరు స్థూల పోషకాలపై ఆధారపడి ఉంటుంది. ఇక క్రోమియం, కాపర్, ఫ్లోరైడ్, అయోడిన్, ఐరన్, మాంగనీస్, మాలిబ్డినమ్, సెలీనియం, జింక్ లు సూక్ష్మ పోషకాలు లేదా ట్రేస్ మినరల్స్. ఇందులో క్రోమియం రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు సాధారణంగా ఉండేందుకు తోడ్పడుతుంది. మిగతా ట్రేస్ మినరల్స్ అన్నీ శరీరంలో హార్మోన్లు, ఎంజైముల తయారీకి అవసరం. మరి ఈ ఖనిజ లవణాలు ఏమిటి, వేటి నుంచి అవి లభిస్తాయి, లోపిస్తే వచ్చే సమస్యలేమిటి, ఎలాంటి జాగ్రత్తలు చేపట్టాలో తెలుసుకుందాం.. రోజూ అందాల్సిందే.. ఖనిజ లవణాలన్నీ తక్కువ స్థాయిలోనే అయినా శరీరానికి అత్యంత అవసరం.

ఈ ఖనిజాలు అందితే ఆరోగ్యం సూపర్..



అంతేకాదు ఇవి రోజూ శరీరానికి అందాల్సిందే. లేకపోతే మనకు ఎన్నో రకాల అనారోగ్యాలు, వ్యాధులు కలుగుతాయి. సాధారణంగా ఈ ఖనిజ లవణాలన్నీ మనం తీసుకునే ఆహారం ద్వారానే లభిస్తాయి. పోషకాహారం తీసుకునేవారిలో ఖనిజ లవణాల లోపం ఏర్పడే అవకాశం తక్కువ. కాల్షియం, అయోడిన్, ఐరన్ ల లోపం మాత్రం ఎక్కువగా కనిపిస్తుంటుంది. అంతేగాకుండా ఎప్పుడూ ఒకే రకమైన ఆహారం తీసుకోవడం లేదా కొన్ని రకాల ఆహారానికి పూర్తిగా దూరంగా ఉండడం వల్ల కూడా ఖనిజ లవణాల లోపం ఏర్పడుతుంది. ఉదాహరణకు గుడ్లు, పాల పదార్థాలు, శాకాహారం మాత్రమే తీసుకునే వారిలో ఐరన్ లోపిస్తుంది. ఇక శిశువులకు ఖనిజ లవణాల అవసరం ఎక్కువ. ఎందుకంటే వారిలో పెరుగుదల వేగం ఎక్కువగా ఉంటుంది. ఖనిజ లవణాలేవైనా ఒక పరిమిత స్థాయికి మించి సప్లిమెంట్ల రూపంలో తీసుకుంటే అవి శరీరానికి విషంగా పరిణమించే ప్రమాదం ఉంటుంది. అందువల్ల వీటి లోపం ఏర్పడినవారు తప్పనిసరిగా వైద్యుల పర్యవేక్షణలో, వారు సూచించిన మోతాదుల్లోనే వినియోగించాలి.

స్థూల ఖనిజాలు

ప్రాణాధారం .. ఖనిజ లవణాలు శరీరానికి ప్రాణాధారం. ఇవి కణాల లోపలి నుంచి శరీరం మొత్తం మీద వివిధ ద్రవ పదార్థాల స్థితిని కాపాడుతాయి. ఈ ఖనిజ లవణాలతో తయారయే ఎలక్ట్రోలైట్లు నాడులు, కండరాల పనితీరును నియంత్రిస్తాయి. శరీరంలో ఆమ్లయుత-క్షారయుత పరిస్థితిని సమతుల్యం చేస్తాయి. ఒకవేళ ఖనిజ లవణాల లోపం ఏర్పడితే ఎలక్ట్రోలైట్లు తగ్గిపోయి.. శరీరంలో నీటి శాతం పడిపోతుంది. కండరాలు, నాడుల పనితీరు దెబ్బతింటుంది. ఇది చివరికి మరణానికి కూడా దారితీసే అవకాశం ఉంటుంది. ఈ ఖనిజ లవణాల లోపాన్ని రక్త, మూత్ర పరీక్షల ద్వారా గుర్తించవచ్చు. ఎముకలు, కండరాలకు కాల్షియం.. శరీరంలో ఎముకలు, దంతాలు ఏర్పడడానికి, ఎముకలు బలహీనం కాకుండా ఉండడానికి, విరిగిన ఎముకలు అతుక్కోవడానికి ఇది తోడ్పడుతుంది. గాయాలైనప్పుడు రక్తం గడ్డకట్టడానికి, కండరాల పనితీరు సరిగా ఉండడానికి కాల్షియం, గుండె సరిగా కొట్టుకోవడానికి, శరీరంలో చాలా రకాల ఎంజైములు సరిగా పనిచేయడానికి కూడా కాల్షియం అత్యవసరం. శరీరానికి తగిన మోతాదులో కాల్షియం అందకపోతే రక్తంలో కాల్షియం లోపిస్తుంది. దాంతో శరీరం ఎముకల నుంచి కాల్షియంను రక్తంలోకి తరలిస్తుంది. దీనినే 'హైపోకాల్సిమియా' అంటారు. దీంతో ఎముకలు బలహీన పడి 'ఆస్టియోపోరోసిస్' సమస్య తలెత్తుతుంది. చిన్నపాటి దెబ్బలు, ప్రమాదాలకే విరిగిపోతాయి. మనిషి శరీర బరువులో 1.5 నుంచి 2 శాతం దాకా కాల్షియం ఉంటుంది. కాల్షియం ఎక్కువగా పాలు, పాల పదార్థాలు, మాంసం, గుడ్లు వంటి పదార్థాల్లో లభిస్తుంది. సాధారణ వ్యక్తులకు రోజుకు 1,000 మిల్లీగ్రాములు, 50 ఏళ్ల పైబడిన వారికి 1,200 మిల్లీగ్రాముల కాల్షియం అవసరం. ఇది రోజుకు 2,500 మిల్లీగ్రాములకు మించి తీసుకుంటే శరీరానికి విషపూరితంగా మారుతుంది. శరీరంలో కాల్షియం స్థాయి ఎక్కువైతే 'హైపర్ కాల్సిమియా' సమస్య తలెత్తుతుంది.

దానివల్ల అజీర్తి, విపరీతమైన దాహం, కడుపునొప్పి, ఆకలి మందగించడం, మూత్రం ఎక్కువగా రావడం, గందరగోళపడడం వంటి మానసిక సమస్యలు తలెత్తుతాయి. చివరికి కోమాలోకి వెళ్లి మరణం కూడా సంభవించే అవకాశం ఉంటుంది. కణాలకు, శరీర సమతుల్యతకు సోడియం .. నాడులు, కండరాలు సరిగా పనిచేయడానికి, శరీరంలో ద్రవాల సమతుల్యతకు సోడియం అత్యవసరం. రక్తంలోను, కణాల చుట్టూ ఉండే ద్రవం (ఫ్లూయిడ్)లోను సోడియం ఉంటుంది. ఇది గ్లూకోజ్, నీరు, అమైనో ఆమ్లాల రవాణాలో తోడ్పడుతుంది. సాధారణంగా సోడియం లోపం ఏర్పడడం అరుదు. శరీరం నుంచి ద్రవాలు విపరీతంగా వెళ్లిపోయే డీహైడ్రేషన్ (అతి మూత్రం, వాంతులు, విరేచనాలు, విపరీతంగా చెమట పట్టడం వంటివి), కిడ్నీలు దెబ్బతినడం, శరీరంపై తీవ్రంగా కాలిన గాయాలు కావడం వంటి పరిస్థితుల్లో శరీరంలో సోడియం లోపం ఏర్పడుతుంది. దీనివల్ల కండరాల వణుకు, బిగుసుకుపోవడం, గందరగోళం, స్పృహ తప్పిపోవడం వంటి ప్రమాదాలు ఏర్పడుతాయి. ఈ పరిస్థితి మరీ తీవ్రమైతే కోమాలోకి వెళ్లిపోతారు, మరణం కూడా సంభవించవచ్చు. ఎలక్ట్రోలైట్లు ఎక్కువగా ఉండే ద్రవాలను తీసుకోవడం ద్వారా, సోడియం ద్రవాన్ని నరాల ద్వారా ఎక్కించడం ద్వారా లోపాన్ని అధిగమించవచ్చు. అయితే సోడియం ఎక్కువగా తీసుకోవడం వల్ల చాలా సమస్యలు తలెత్తుతాయి. రక్తంలో ద్రవాల శాతం పెరిగి రక్తపోటుకు దారితీస్తుంది. గుండెపోటు, కడుపులో కేన్సర్, కిడ్నీ వ్యాధులు, కాలేయ సమస్యలు తలెత్తుతాయి. సోడియం ఖనిజానికి ప్రధానమైన వనరు ఉప్పు. మాంసం, వెన్న, ఆలివ్, మొక్కజొన్న, బంగాళదుంపల్లో కూడా ఇది లభిస్తుంది.

సాధారణ వ్యక్తులకు రోజుకు 1,000 మిల్లీగ్రాముల సోడియం అవసరం. దీనిని రోజుకు 2,400 మిల్లీగ్రాములకు మించి తీసుకుంటే శరీరానికి విషపూరితంగా మారుతుంది. ప్రస్తుతం మారిన ఆహార అలవాట్ల కారణంగా శరీరానికి అందే సోడియం శాతం చాలా ఎక్కువగా ఉంటోంది. ముఖ్యంగా రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలోని ఆహార పదార్థాలు, బేకరీల్లోని జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్, ఇంట్లోనూ ఉప్పు అధికంగా వినియోగించడం వంటివాటి వల్ల అధికంగా సోడియం అందుతోంది. ఇది ఎన్నో సమస్యలకు దారితీస్తుంది. మెదడు, కండరాల ఆరోగ్యానికి పొటాషియం శరీరారానికి అత్యంత అవసరమైన పోషకాల్లో పొటాషియం ప్రధానమైనది. ముఖ్యంగా నాడులు, కండరాలు సక్రమంగా పనిచేయాలంటే శరీరానికి తగిన మోతాదులో పొటాషియం అందాల్సిందే. అంతేకాదు గుండె జబ్బుల నివారణ, రక్తపోటు నియంత్రణలోనూ ఇది కీలకం. ఎముకలు దృఢంగా ఉండడానికి, మూత్ర పిండాల్లో రాళ్లు ఏర్పడకుండా నిరోధించడానికి తోడ్పడుతుంది. శరీరంలో ఉండే పొటాషియంలో చాలా వరకు కణాల అంతర్భాగంలో ఉంటుంది. పొటాషియం స్థాయిలు బాగా పెరిగినా.. బాగా తగ్గినా కూడా ఇబ్బందే. దీనివల్ల గుండెపోటు వచ్చే ప్రమాదమూ ఉంటుంది. పొటాషియం లోపం వల్ల కండరాలు బలహీనమైపోతాయి. అది తీవ్రమైతే పక్షవాతం వచ్చే ప్రమాదం ఉంటుంది. హైపర్ థైరాయిడిజం సమస్య తలెత్తుతుంది.

పాలు, అరటిపండ్లు, టామాటా, నారింజ, పుచ్చకాయ, బంగాళదుంప, చిలగడదుంప, పాలకూర, ఆకుపచ్చని కూరగాయలు, బఠాణీ, చిక్కుడు వంటి గింజలు, ఓఆర్ఎస్ పౌడర్ వంటి ఎలక్ట్రోలైట్ ద్రవాల్లో పొటాషియం ఎక్కువగా లభిస్తుంది. ఇది సాధారణ వ్యక్తులకు రోజుకు 3.5 గ్రాముల వరకు అవసరం. చిన్న పిల్లలు, గర్భిణులకు మరింత ఎక్కువగా అంటే 4.7 గ్రాముల వరకు అందాలి. అయితే దీర్ఘకాలం పాటు పొటాషియం ఎక్కువ మోతాదులో అందడం వల్ల గుండెకు చేటు కలుగుతుంది. రక్త పరీక్షల ద్వారా శరీరంలో పొటాషియం స్థాయిలను తెలుసుకోవచ్చు. బీడీలు, సిగరెట్లు, ఖైనీల వంటి పొగాకు ఉత్పత్తులు, ఆల్కాహాల్ కారణంగా.. సరైన పోషకాహారం తీసుకోకపోవడం, కొన్ని రకాల మందుల వినియోగం వల్ల శరీరంలో పొటాషియం లోపం ఏర్పడుతుంది. దీనిని హైపోకాలేమియా అంటారు. లోపం ఉన్నవారు ఆహారంలో మార్పులు, సప్లిమెంట్ల ద్వారా తీసుకోవచ్చు. ఇక మూత్ర పిండాలు దెబ్బతినడం, కొన్ని రకాల మందులు, అధికంగా పొటాషియం ఉండే ఆహారం తీసుకోవడం వంటి కారణాల వల్ల శరీరంలో పొటాషియం స్థాయి పరిమితికి మించి పెరుగుతుంది. దీనివల్ల కండరాల బలహీనత, గుండె కొట్టుకునే వేగంలో మార్పులు, చివరికి గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంటుంది. రక్తపోటు నియంత్రణకు క్లోరిన్ (క్లోరైడ్) : శరీరంలో ద్రవాల స్థితిని సమతూకంగా ఉంచేందుకు క్లోరైడ్ అత్యవసరం. అంతేగాకుండా కండరాల పనితీరుకు, రక్త పోటును నియంత్రణలో ఉంచడానికి ఇది తోడ్పడుతుంది. అయితే సాధారణంగా క్లోరైడ్ లోపం ఏర్పడడం చాలా అరుదు. ఎందుకంటే మనం నిత్యం ఉపయోగించే అన్ని రకాల ఆహార పదార్థాల్లోనూ ఉప్పును వినియోగిస్తాం. దాని నుంచి తగిన మోతాదులో క్లోరైడ్ అందుతుంది. క్లోరైడ్ కు ప్రధాన వనరు మనం సాధారణంగా వినియోగించే ఉప్పు. దీంతోపాటు వెన్న, ఆలివ్, మొక్కజొన్న బ్రెడ్, ఆలూ చిప్స్ వంటి ప్రాసెస్డ్ ఆహారం, మాంసంలోనూ లభిస్తుంది. సాధారణ వ్యక్తులకు రోజుకు ఒక గ్రాము (1000 మిల్లీగ్రాముల) క్లోరైడ్ అవసరం. క్లోరిన్ స్వతహాగా విషపూరితమైన పదార్థం. అది పరిమితికి మించితే ప్రమాదకరంగా మారుతుంది. అయితే ఆహారం ద్వారా అధికంగా అందే క్లోరిన్ ను శరీరం ఎప్పటికప్పుడు విసర్జిస్తూ ఉంటుంది.

ఎదుగుదలకు తోడ్పడే మెగ్నీషియం .. శరీరంలో ఎముకలు, దంతాల నిర్మాణానికి.. నాడులు, కండరాల పనితీరు సరిగా ఉండడానికి మెగ్నీషియం అత్యవసరం. ముఖ్యంగా శరీరంలో వివిధ అవయవాలు విడుదల చేసే ఎంజైములు క్రియాశీలం కావడంలో ఇది కీలకపాత్ర పోషిస్తుంది. దగ్గు, ఛాతీ బిగపట్టినట్టు ఉండడం, శ్వాస సరిగా తీసుకోలేకపోవడం, పిల్లికూతలు తదితర లక్షణాలు కనిపిస్తాయి.

ఆస్తమా లక్షణాల్లో శ్వాస నాళా ల్లో వాపు వచ్చి అవి కుచించుకుపోతా యి. దాంతో శ్వాస కష్టంగా అనిపిస్తుంది. ఆస్తమా సమస్య ఉన్న 78 శాతం మందిలో అలెర్జిక్ రైనైటిస్ కూడా ఉంటుంది. ఈ రెండింటికీ ఒకదానితో ఒకటి సంబంధం ఉంది. ఎక్కువ మందిలో అలెర్జిక్ రైనైటిస్ తోనే మొదలై ఆస్తమాగా మారుతుంది. ఆస్తమా ఉన్న వారికి శ్వాసకోస ఇన్ఫెక్షన్లు వస్తే పరిస్థితి మరింత తీవ్రతరం అవుతుంది.

ఫుడ్ అలెర్జీ : ఫుడ్ అలెర్జీ ఉన్న వారికి కొన్ని రకాల ఆహార పదార్థాలు సరిపడవు. దీంతో ఆ పదార్థాలు తీసుకున్నప్పుడు అందులో ఉండే అలెర్జీ కారకాలపై పోరాడేందుకు రోగ నిరోధక వ్యవస్థ స్పందిస్తుంది. ఆవు పాలు, గుడ్లు, వేరు శనగ, గోధుమ, సోయా, చేపలు, షెల్ ఫిష్, నట్స్ లో ఉండే కాంపోనెంట్స్ వల్ల ఫుడ్ అలెర్జీలు వచ్చే అవకాశం ఉంది. యాంటీబయోటిక్స్ (పెన్సిలిన్), యాస్పిరిన్, ఐబూప్రోఫెన్ తరహా యాంటీ ఇన్ఫ్లమేటరీ ఔషధాల వల్ల కూడా అలెర్జిక్ రియాక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది.

సైనసైటిస్ :నాసికా కుహరములలో (ముక్కకు అనుసంధానంగా ముక్కు పక్క న కంటి కింద భాగంలో ఉండేవి) వాపునే సైనసైటిస్ అంటారు. సైనసైటిస్ సమస్యలో ఇలా వాపు కారణంగా రంధ్రాలు మూసుకుపోతాయి. అవి ఫ్లూయిడ్ తో పూడుకుపోతాయి. అప్పుడు క్రిములు వృద్ధి చెంది ఇన్ఫెక్షన్ కు దారితీస్తాయి. తలనొప్పి, ముక్కు భాగంలో నొప్పి, ముక్కు కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

తీవ్రమైన అలెర్జిక్ రియాక్షన్స్ : అనాఫిలాక్సిస్ అనేది తీవ్రమైన ప్రాణాంతక

తరచూ అలెర్జీ సమస్యలు... ఎందుకని?

ఈ రోజుల్లో ఎక్కడ చూసినా... అలెర్జీ అన్న పదం వినిపిస్తూనే ఉంటుంది. మన చుట్టూ ఉన్న వారిలో చాలా మందిలో ఈ సమస్య కనిపిస్తుంది. తుమ్ములు, దగ్గు, ముక్కు కారటం, దురదలు ఇలా అలెర్జీ వలన కనిపించే లక్షణాలు, సమస్యలు చాలా మందికి అనుభవమే. ప్రపంచ వ్యాప్తంగా 10 నుంచి 30 శాతం మంది వరకు అలెర్జీ బాధితులే. ఆధునిక కాలంలో బాగా విస్తరించిపోయిన ఈ సమస్య గురించి తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

అలెర్జీ అంటే ఏంటి...? ఆహారం, పుప్పొడి రేణువులు, దుమ్ములోని పురుగులు (డస్ట్ మైట్స్), మందులు, ఇలా ఎన్నో వాటి వల్ల ఈ సమస్య వస్తుంటుంది. రోగ నిరోధక వ్యవస్థ అన్నది మన శరీరంలో అతి క్లిష్టమైన వ్యవస్థ. వైరస్, బ్యాక్టీరియా, టాక్సిన్ల (ఫారీన్ సబ్ స్టాన్స్/ఫారీన్ ఇన్వేడర్స్) నుంచి మన శరీరాన్ని కాపాడుతూ ఉండే వ్యవస్థ. అలెర్జీ కారకాలు మన శరీరంలోకి చొరబడడం ఆలస్యం వీటిని హానికారకాలుగా గుర్తించిన ఆ క్షణమే రోగ నిరోధక వ్యవస్థ వాటిపై దాడి మొదలు పెడతుంది.



అలెర్జీకి కారణం కావన్న దానికి ఇంత వరకు కచ్చితమైన కారణాలు నిర్ధారణ కాలేదు. అలాగే, కొందరు అలెర్జీకి లోనైతే, అవే కారకాలు మరికొందరిలో అలెర్జీకి దారితీయకపోవడం వెనుకనున్న కారణాలను కూడా పరిశోధనలు ఇతమిద్ధంగా తేల్చలేదు.

అలెర్జిక్ రైనైటిస్ (ముక్కు కారటం), అలెర్జిక్ కంజెంక్టివైటిస్ (కంటి దురదలు, అలెర్జీలు), అలెర్జిక్ ఆస్తమా, యుర్టికేరియా (హైవ్స్), ఫుడ్ అలెర్జీలు. ఇవి అతి సాధారణంగా, ఎక్కువగా కనిపించే అలెర్జీలు. అలెర్జీ కారకాలను గాలి ద్వారా పీల్చవచ్చు. ఆహారం ద్వారా కడుపులోకి తీసుకోవచ్చు. మందులు లేదా పురుగు కాటు ద్వారా చర్మం ద్వారా శరీరంలోకి ప్రవేశించొచ్చు. ఏ మార్గం ద్వారా శరీరంలోకి ప్రవేశించాయన్నదాన్ని బట్టి అలెర్జీ లక్షణాలు కనిపిస్తాయి. ఉదాహరణకు ఆహారంలో అలర్జీ కారకాలుంటే దాన్ని తీసుకున్నప్పుడు విడుదలయ్యే మీడియేటర్స్ చర్మంపై దద్దుర్లకు కారణమవుతాయి. అలెర్జిక్ రైనైటిస్ : అలెర్జిక్ వ్యాధుల్లో ఎక్కువగా కనిపించే సమస్య ఇది. కాలానుగుణంగా లేదా ఎప్పుడూ ఉండొచ్చు. దీన్ని హేఫీవర్ అని కూడా అంటుంటారు. అదే పనిగా తుమ్ములు, ముక్కు కారటం, ముక్కులు మూసుకుపోవడం, ముక్కులో, కళ్లల్లో, నోటి పై భాగంలో దురద ఉంటుంది. ఈ సమస్య ఎప్పుడూ వేధిస్తుంటే ఇంట్లో ఉండే డస్ట్ మైట్స్, పెంపుడు జంతువులు, బూజు కారణం కావొచ్చు. ప్రధానంగా గాలిలో చేరిన అలెర్జీ కారకాలు శ్వాస తీసుకునే సమయంలో ముక్కుల్లో చేరడం వల్ల ఈ సమస్య నిరంతరం వేధిస్తుంటుంది. అలెర్జీ కారకాలు ముక్కులోపలికి చేరిన తర్వాత కణజాలం వాపునకు గురవుతుంది. ఈ అలెర్జీకి కళ్లు, చెవులు, సైనస్ తోనూ సంబంధం ఉంటుంది. యుర్టికేరియా (దద్దుర్లు) : చర్మంపై ఎర్రటి దద్దుర్లు కనిపిస్తాయి. పెద్దగా లేదా చిన్నగా ఉండొచ్చు. దురద ఉంటుంది. కొన్ని రకాల ఆహార పదార్థాలు, మందుల వల్ల ఈ సమస్య ఏర్పడుతుంది. చిన్నారుల్లో వైరల్ ఇన్ఫెక్షన్ వల్ల కూడా రావచ్చు. అలెర్జిక్ కంజెంక్టివైటిస్ : అలెర్జీ కారకాలకు కళ్లు స్పందించినప్పుడు ఏర్పడే లక్షణాలు కళ్లు ఏర్రబారడం, దురద, వాపు. నీరు కారడం, కనుగుడ్డు చుట్టుపక్కల, కను రెప్పల లోపలి వైపు భాగంలో వాపు, మంట వుంటాయి. ఆస్తమా : ఆస్తమా అన్నది దీర్ఘకాలిక, ఎడతెగని ఊపిరితిత్తుల సమస్య.



అలెర్జిక్ రియాక్షన్. ఆహార పదార్థాలు, పురుగులు కుట్టడం, మందుల వల్ల ఈ రియాక్షన్ రావచ్చు. ఒకే సమయంలో ఒకటికి మించిన ప్రాంతాల్లో ఈ రియాక్షన్ వచ్చే అవకాశాలూ ఉన్నాయి. వేడిగా ఉండడం, ఎర్రబారడం, ఎర్రగా ర్యాష్ ఉండి దురద పెట్టడం, శ్వాస సమస్య, గొంతు పట్టేసినట్టు ఉండడం, ఆందోళన, వాంతులు, డయేరియా, తిమ్మిర్లు వంటివి కనిపిస్తాయి. కొందరిలో రక్తపోటు పడిపోయి షాక్ కు లోను కావచ్చు. ఈ రియాక్షన్ కు వెంటనే చికిత్స ఇప్పించాలి. లేకుంటే ప్రాణాంతకం అవుతుంది.

అలెర్జీలు కనిపిస్తే ఏం చేయాలి...? అలెర్జీ సమస్యలు కనిపిస్తే ఇమ్యునాలజిస్ట్ లేదా ఎండీని సంప్రదించాలి. కుటుంబ ఆరోగ్య చరిత్ర, శారీరక పరిశీలన, చర్మ పరీక్ష, రక్త పరీక్షల ద్వారా వైద్యులు అలెర్జీ కారకాలను గుర్తిస్తారు. ఆ తర్వాత దాన్ని కంట్రోల్ చేసేందుకు ట్రీట్ మెంట్ కు ప్లాన్ చేస్తారు. ఇంజెక్షన్లు, టాబ్లెట్లు సూచించవచ్చు. యాంటీ హిస్టామిన్స్, నాసల్ యాంటీ హిస్టామిన్స్, నాసల్ కార్టికోస్టెరాయిడ్ డ్రాప్స్, ఆస్తమాలో ఇన్ హేలర్స్, ఓరల్ స్టెరాయిడ్స్ ఇలా మందులు సూచిస్తారు. ఇవి కూడా దీర్ఘకాలం పాటు వాడాల్సి ఉంటుంది. దాదాపు చాలా రకాల అలెర్జీలకి శాశ్వత నిర్మూలన లేదు. వాటిని అదుపు చేయడం వరకే చికిత్స. అలెర్జీలకు సమర్థవంతమైన చికిత్స కోసం ప్రపంచవ్యాప్తంగా ఎన్నో పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. కానీ, ఇంతవరకూ వాటిని పూర్తిగా నిర్మూలించే సమర్థవంతమైన చికిత్సలు సాధ్యం కాలేదు. పిల్లల్లో ఆహారం, మందుల పరంగా ఉన్న అలెర్జీలు తర్వాత కాలంలో వాటంతట అవే కనుమరుగు అయ్యే అవకాశం ఉంటుంది.

ఎవరికి రిస్క్ : అలెర్జీలు ఏ వయసులోనయినా రావచ్చు. ఆహార పరమైన అలెర్జీలు మాత్రం చిన్న వయసులోనే మొదలవుతాయి. కుటుంబ చరిత్ర, జెనెటిక్స్ ప్రధాన పాత్ర పోషిస్తాయి. తల్లిదండ్రులకు అలెర్జీలు ఉంటే పిల్లలకూ అవి రావడానికి ఎక్కువ అవకాశాలుంటాయి. సహజంగా జన్మించడం కాకుండా, సిజేరియన్ ద్వారా పుట్టిన పిల్లలకు అలెర్జీల రిస్క్ ఎక్కువగా ఉంటుంది. నివారణ : పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలి. ఇది ఈ రోజు దాదాపుగా అసాధ్యం. ఇంట్లో ఉండే డస్ట్ మైట్స్ వల్ల అలెర్జీలు వస్తుంటే తేమ తక్కువ ఉండేలా చూసుకోవడంతోపాటు వారానికోసారి బెడ్ షీట్స్, పిల్లో కవర్స్, బ్లాంకెట్లను వేడినీటితో వాష్ చేయాలి. ఇంట్లో పెంపుడు జంతువుల కారణంగా అలెర్జీలు వస్తుంటే వాటిని ఇంట్లో లేకుండా చూసుకోవాలి. అలాగే, ఇంట్లో పీల్చే వాయువును స్వచ్ఛంగా మార్చేందుకు ఎయిర్ ప్యూరిఫయర్లు మార్కెట్లో ఉన్నాయి.

DHARANI NEWS DAILY
ధరణి న్యూస్
www.dharaninews.com
తెలుగు దినపత్రిక

ఆ ఐదుగురు సౌత్‌లో మొదలై అగ్రతారలయ్యారు



కొత్త వారికి బాలీవుడ్‌లోకి అడుగుపెట్టడం కచ్చితంగా కష్టమే. సూపర్ స్టార్ సరసన నటించిన ప్రతి ఒక్క నటీమణి విజయవంతంగా వెండితెరపై వెలిగిపోలేరు. కొందరు హీరోయిన్లు దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమలో తమ మొదటి అడుగు వేయడం ద్వారా బాలీవుడ్‌లో విజయాల మెట్లు ఎక్కుతున్నారు. పలువురు నాయికలు ఎలాంటి సపోర్టు లేకుండానే బాలీవుడ్‌లో పెద్ద ఎత్తున దూసుకుపోయారు. సౌత్ ఇండియన్ సినిమాల ద్వారా హిందీ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టడం అనేది విజయానికి ఒక ఫార్ములా. సౌతిండస్ట్రీలో కెరీర్ ప్రారంభించి బాలీవుడ్ లో అగ్ర పథానికి ఎదిగిన ఐదుగురు బాలీవుడ్ హీరోయన్ల గురించి ఈ స్టోరి... వీడియో: బర్త్ డే పార్టీలో మలైకా భగభగలు హేమ మాలిని హిందీ చిత్ర పరిశ్రమలో స్వర్ణయుగాన్ని శాసించిన బాలీవుడ్ నటి హేమమాలిని సౌత్ ఇండియన్ సినిమాల్లో తన కెరీర్‌ను ప్రారంభించింది. డ్రీమ్ గర్ల్ గా ఆమె పాపులరయ్యారు. హేమ మాలిని తమిళ చిత్రం ఇదు సత్యంతో తన నటనా జీవితాన్ని ప్రారంభించింది. ఆ తర్వాతసప్నో కా సౌదాగర్‌తో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత షోలే -బాగ్‌బాన్ -నసీబ్ వంటి బంపర్ హిట్ చిత్రాల్లో నటించారు. హేమ మాలిని రాజకీయ రంగంలోను రాణించారు. ఉస్తాద్ భగత్ సింగ్.. అంచనాలకు మించి..! ప్రియాంక చోప్రా బాలీవుడ్ టు హాలీవుడ్ తన కీర్తిని విస్తరించిన ప్రియాంక చోప్రా తొలిగా ఓ సౌత్ సినిమాలోనే నటించారు. తమిజాన్ అనే తమిళ చలనచిత్రంతో తెరంగేట్రం చేసింది. బాజీరావ్ మస్తానీ-బర్ఫీ-మేరీ కోమ్- ఫ్యాషన్ సహా ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించింది. ఐశ్వర్యరాయ్ బచ్చన్ బాలీవుడ్‌లోని అగ్ర కథానాయికల్లో ఒకరైన ఐశ్వర్య రాయ్ బచ్చన్ 1994లో మిస్ వరల్డ్‌గా కిరీటం పొందిన తర్వాత సినీఆరంగేట్రం చేసారు. 1997లో తమిళ చిత్రం ఇరువర్‌తో తన నటనా జీవితాన్ని ప్రారంభించి పలు విజయవంతమైన చిత్రాల్లో నటించారు. తాళ్- దేవదాస్ -ధూమ్ 2-రావణ్ -జోధా అక్బర్ వంటి హిట్ చిత్రాలలో నటించింది. బాలీవుడ్ ని అగ్ర హీరోయిన్ గా ఏలారు. భగవంత్ కేసరి సీక్వెల్.. అనిల్ రావిపూడి ఏం అన్నాడంటే? దీపికా పదుకొనే దీపికా పదుకొణె %ఓం శాంతి ఓం%లో శాంతిప్రియగా నటించడానికి ముందే కన్నడ సినిమా ఐశ్వర్యలో ఉపేంద్ర సరసన నటించారు. ఆ తర్వాతే షారూఖ్ ఖాన్ సరసన దీపిక బాలీవుడ్‌లో ఘనమైన అరంగేట్రం చేసింది. అయితే పరిశ్రమలో స్థిరంగా ఉండటానికి ఆమె చేసిన పోరాటం చాలా పెద్దదే. ఇప్పుడు భారతదేశంలోనే టాప్ 5 హీరోయిన్లలో ఒకరిగా వెలిగిపోతున్నారు. బాజీరావ్ మస్తానీ-పద్మావత్ -పికూ- పఠాన్ వంటి బ్లాక్ బస్టర్లలో నటించారు చేస్తున్న సినిమా టైటిల్‌నే మర్చిపోతే ఎలా? తాప్సీ పన్ను పింక్ -తప్పడ్ వంటి సామాజిక నేపథ్య చిత్రాలలో శక్తివంతమైన పాత్రలతో పేరు తెచ్చుకున్న తాప్సీ అంతకుముందు సౌతిండస్ట్రీలో తన కెరీర్‌ను ప్రారంభించారు. తాప్సీ పన్ను తెలుగులో ఝుమ్మంది నాదం, తమిళంలో ఆడుకలం చిత్రాలతో అరంగేట్రం చేసిన తర్వాత సౌత్ స్టార్ గా పేరు తెచ్చుకుంది. దక్షిణ భారత చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక గొప్ప పేరు తెచ్చుకుంది. సౌత్‌లో సక్సెస్ అయిన తర్వాత బాలీవుడ్‌లో కూడా మంచి గుర్తింపు తెచ్చుకుంది.

బ్లాక్ అండ్ రెడ్‌లో డిస్నీ ప్రిన్సెస్



కన్నడ మూవీ గిల్లితో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్. తక్కువ సమయంలోనే ఈ అమ్మడు టాలీవుడ్‌లోనూ అడుగు పెట్టింది. తెలుగులో మొదటగా ఈఅమ్మడు కెరటం సినిమాను చేయడం ద్వారా టాలీవుడ్‌లో పరిచయం అయింది. 2013లో ఈ అమ్మడు తెలుగులో చేసిన వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ సినిమాతో ఒక్కసారిగా స్టార్‌డం దక్కించుకుంది. చిన్న సినిమాల హీరోయిన్ కాస్త స్టార్ హీరోయిన్‌గా మారి పోయింది. హీరోయిన్‌గా ఈ అమ్మడు రామ్ చరణ్, ఎన్టీఆర్, అల్లు అర్జున్, మహేష్ బాబు ఇలా టాప్ స్టార్స్ తో నటించే అవకాశాన్ని దక్కించుకోవడంతో టాప్ స్టార్ హీరోయిన్‌గా మారి పోయింది. సాధారణంగానే హీరోయిన్స్‌కి కెరీర్ స్పాన్ తక్కువ అంటారు. కానీ రకుల్ ప్రీత్ సింగ్ టాప్ హీరోయిన్‌గా ఉన్న సమయంలోనే సడెన్‌గా ఆఫర్లు తక్కువ అయ్యాయి. అందం విషయంలో ఏమాత్రం తగ్గకున్నా ఈ అమ్మడికి ఆఫర్లు తగ్గి పోయాయి.టాలీవుడ్ నుంచి ఆఫర్లు తగ్గినా బాలీవుడ్‌లో సినిమాలు చేస్తూ కెరీర్ లో ముందుకు సాగింది. ఈ మధ్య కాలంలో సినిమాలకు కాస్త ఎక్కువ గ్యాప్ వస్తోంది. అయితే ఈ గ్యాప్‌లో ఫోటో షూట్స్ తో రకుల్ ప్రీత్ సింగ్ కుమ్మేస్తోంది. ఆకట్టుకునే అందం తో పాటు, మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అనడంలో ఎలాంటి సందేహం లేదు. అందుకే సోషల్ మీడియాలో ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ వస్తోంది. ఆకట్టుకునే అందంతో పాటు, మోడలింగ్ లో పట్టు ఉండటం వల్ల రకుల్ ప్రీత్ సింగ్ ఏ ఫోటో షూట్ చేసినా కూడా బాగా వైరల్ కావడం మనం చూస్తూనే ఉన్నాం. తాజాగా మరోసారి ఈ అమ్మడు తన అందాల ఆరబోత ఫోటో షూట్‌తో సర్‌ప్రైజ్ చేసింది.

క్లీవేజ్ అందాలతో మతి పోగొడుతున్న శ్రీముఖి..!



టాలీవుడ్ బుల్లితెర లోని హాట్ బ్యూటీల్లో శ్రీముఖి ఒకరు. హీరోయిన్ కి ఏ మాత్రం తీసుకుపోకుండా ఉంటుంది. బుల్లితెర రాములమ్మ అని ఆమెను ఫ్యాన్స్ ని ముద్దుగా పిలుచుకుంటూ ఉంటారు. ఎలాంటి డ్రెస్ లు వేసినా ఫ్యాన్స్ ని మెస్మరైజ్ చేయగలదు. తెలుగు అమ్మాయి అయినా, ఎక్స్ పోజింగ్ చేయడంలో, క్లీవేజ్ షో చేయడంలో ఏ మాత్రం వెనకాడదు. ఎంత పెద్ద స్టేజ్ అయినా, ఏ మాత్రం తడపడకుండా యాంకరింగ్ చేయగలదు. ఇక, సోషల్ మీడియాలో ఎప్పుడూ చురుకుగా ఉంటుంది. ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో ఫోటోలు షేర్ చేస్తూ ఉంటుంది. సమంత ప్రాజెక్ట్.. రష్మిక చేతిలోకి..? తాజాగా కూడా కొన్ని ఫోటోలు షేర్ చేసింది. ఆరెంజ్ కలర్ లాంగ్ ఫ్రాక్ లో మెరిసింది. అయితే, ఆ డ్రెస్ లో కొంచెం బొద్దుగా కనపడుతోంది. అయితే, ఎక్కువగా ఆమె ఎద అందాలు ఆ డ్రెస్ లో నుంచి స్పష్టంగా కనపడుతున్నాయి. దీంతో, ప్రస్తుతం ఈ ఫోటోలు ఫ్యాన్స్ ని విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఆమె డ్రెస్ కి మ్యాచింగ్ గా ఆమె సిల్వర్ జ్యూవెలరీ ధరించడంతో, ఆమె చర్మం పై ఆ జ్యూవెలరీ మరింతగా మెరుస్తోంది. కాగా, ప్యాన్స్ ఆమె అందంపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. అసలు ఇంత అందంగా ఎలా ఉన్నావ్ అంటూ చాలా మంది కామెంట్స్ చేస్తున్నారు. ఇక, శ్రీముఖి కేవలం యాంకరింగ్ మాత్రమే కాదు, మధ్యలో కొన్ని సినిమాలు కూడా చేసింది. కానీ, హీరోయిన్ గా వర్కౌట్ కాలేదు. దీంతో, బుల్లితెరకు పరిమితమైంది. బిగ్ బాస్ సీజన్ 3లో నూ సందడి చేసింది. ఇప్పటికీ కంటిన్యూస్ గా ఆమె ప్రోగ్రామ్స్ చేస్తూనే ఉంది. రీసెంట్ గా చిరంజీవి భోళాశంకర్ మూవీలో ఓ కీలక పాత్ర లో నటించింది. ఖుషీ సినిమా నడుము సీన్ ని చిరు, శ్రీముఖి చేయడం విశేషం. అయితే, ఈ మూవీ పెద్దగా ఆకట్టుకోలేకపోయింది.

పూజా బేబీ లవ్‌లో పడిందా.? పడేశారా..?

బుట్ట బొమ్మ పూజా హెగ్డే లవ్‌లో పడిందట. ప్రస్తుతం ముంబై మీడియాలో ఇది హాట్ టాపిక్ గా మారింది. క్రికెటర్ తో పూజా బేబ్ ప్రేమలో ఉందని త్వరలోనే అమ్మడు పెళ్లి కూడా చేసుకుంటుందని వార్తలు వినిపిస్తున్నాయి. ఎలాంటి ఆధారాలు లేకుండా పూజాపై వస్తున్న ఈ న్యూస్ ఆమె ఫ్యాన్స్ ని కంగారు పెట్టిస్తున్నాయి. బాలీవుడ్ లో సినిమాలు చేస్తున్నా సరే వాటి ఫలితాలు ఏవి పూజాకి హ్యాపీ నెస్ ని ఇవ్వలేదు. అసలే అక్కడ కెరీర్ కష్టంగా ఉందని భావిస్తున్న అమ్మడికి మళ్లీ ప్రేమలో ఉంది పెళ్లి చేసుకుంటుంది అంటూ న్యూస్ రావడం షాకింగ్‌గా ఉంది. సమంత ప్రాజెక్ట్.. రష్మిక చేతిలోకి..? ఇంతకీ పూజాతో ప్రేమలో ఉన్న ఆ క్రికెటర్ ఎవరంటే మాత్రం చెప్పట్లేదు. పూజా ఏం చేసినా సరే ముంబై మీడియా ఒక కన్ను వేసి ఉంచుతుంది. తెలుగులో స్టార్ క్రేజ్ తెచ్చుకున్న పూజా పట్ల ముంబై మీడియా ఎప్పుడు ఏదో ఒక విషయం మీద టార్గెట్ చేస్తూనే ఉంది. బాలీవుడ్ లో పూజా ఫెయిల్ అంటూ కథనాలు రాయడమే కాకుండా అన్ ఫిట్ ఫర్ బాలీవుడ్ అనే స్టోరీస్ కూడా వచ్చాయి. ఇక ఇప్పుడు ఏకంగా పెళ్లికి రెడీ అంటూ పూజాపై కథనాలు అల్లేస్తున్నారు. సెలబ్రిటీస్ పర్సనల్ విషయాల మీద అసలేమాత్రం ఇన్ఫర్మేషన్ లేకపోయినా సరే తమకు తోచినట్టుగా రాసేయడం మీడియాకు అలవాటుగా మారింది. ముఖ్యంగా సోషల్ మీడియా వచ్చాక ఇది ఎక్కువైంది నిజంగానే పూజా ప్రేమలో ఉంటే అది చెప్పేందుకు ఆమె అసలు వెనకాడదని చెప్పొచ్చు. మరి అలాంటిది ఆమెను ఓ హీరోతోనో, క్రికెటర్ తోనో లింక్ చేస్తూ వార్తలు రాయడం మాత్రం కరెక్ట్ కాదు.. ప్రభాస్ ఎదుగుదలపై కంగన మనసులో మాట! ఇక అమ్మడి సినిమాల విషయానికి వస్తే తెలుగులో గుంటూరు కారం ఛాన్స్ వదులుకున్న తర్వాత మరో అవకాశం రాబట్టుకోలేని పూజా తెలుగులో ఎలాగైనా మళ్లీ వరుస సినిమాలు చేయాలని చూస్తుంది. గుంటూరు కారం హీరోయిన్ ఛాన్స్ పోయినా ఆ సినిమాలో స్పెషల్ సాంగ్ చేస్తుందన్న టాక్ వినిపిస్తుంది. టైర్ 2 హీరోల సినిమా అవకాశాలు వస్తున్నా పూజానే కావాలని వాటిని పక్కన పెడుతున్నట్టు తెలుస్తుంది. ఇలాంటి టఫ్ టైం లో వచ్చిన అవకాశాన్ని వాడుకోవాలి కానీ అలా కాదనుకుంటూ పోతే ఆమెకే రిస్క్ అని చెప్పొచ్చు. పూజా ఫ్యాన్స్ మాత్రం పెళ్లి వార్తలపై అప్సెట్ లో ఉన్నారు. పూజా మరికొన్నాళ్లు సినిమాలు చేయాలని వారు భావిస్తున్నారు.